పెసరకు దక్కని మద్దతు ధర

- క్వింటా రూ.4వేలు పలుకుతున్న వైనం
- మద్దతు ధర కల్పించాలని వేడుకోలు
- మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్



7

సీసీఐ నిబంధనలు..

పత్తి కొనుగోళ్లకు అడ్డంకులు!


- జిన్నింగ్ మిల్లు ఉంటేనే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రైతులకు శాపంగా మారుతున్న వైనం
- దూరం తీసుకెళ్లలేక ప్రైవేటు దళారులకు అమ్ముకుంటున్న పరిస్థితి
- నిబంధనలు మార్చకపోతే మళ్లీ అదే పరిస్థితి అని ఆవేదన



ఖమ్మం మార్కెట్‌కు వచ్చిన పత్తి (ఫైల్)

ఖమ్మం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నా.. మార్కెట్లలో అనేక సౌకర్యాలు కలిపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఆచరణకు వచ్చే సరికి పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ వానాకాలంలో ఉమ్మడిజిల్లాలో సుమారు మూడున్నరలక్షల ఎకరాల్లో పత్తి సాగయ్యింది. దీపావళి నుంచి పంట చేతికొచ్చే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో రైతుల నుంచి గిట్టుబాటు ధరకు పత్తి పంటను కొనుగోలు చేసేందుకు ఏర్పాటు చేయాల్సిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కేంద్రాల ఏర్పాటు విషయంలో పలు అడ్డంకులు సృష్టిస్తోంది. కేవలం జిన్నింగ్ మిల్లులున్నచోటే పత్తి కొనుగోలు చేస్తామని వేరే చోట కొనుగోలు చేస్తే రవాణా చార్జీలు ఇవ్వబోమని మూడేళ్ల క్రితం తీసుకున్న నిర్ణయం పత్తి రైతులకు శాపంగా మారింది. గతంలో పత్తి పండించే ప్రాంతాల్లో అత్యధికంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి జిన్నింగ్ మిల్లులకు సీసీఐ పత్తిని పంపిచేది. ఇప్పుడు జిన్నింగ్ మిల్లుల వద్దకు పత్తితెస్తే అక్కడే కొనుగోలు (మిగతా 6వ పేజీలో)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో జంగా వెంకటమౌనిక ప్రజాపాలనలో ఉన్న పథకాలతోపాటుగా రేషన్ కార్డుకు కూడా దరఖాస్తు చేసింది. వారికి రేషన్‌కార్డు మంజూరైనట్టు ఎలాంటి సమాచారం లేకపోవడంతో మళ్లీ మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేశారు. ఆ సమయంలో వారు పెట్టిన దరఖాస్తును అధికారులు తిరస్కరించారు. అర్హత ఉన్నా దరఖాస్తు తిరస్కరించడానికి కారణమేంటనే విషయం తెలుసుకునేందుకు వెళ్లిన సందర్భంలో వారికి అప్పటికే కార్డు మంజూరైందని అధికారులు చెప్పడంతో విస్తుపోయారు. సరే ఇంతవరకు బాగానే ఉన్నా.. వారికి మంజూరైన రేషన్‌కార్డు ఏకంగా జిల్లానే మారిపోయి.. ఖమ్మం అర్బన్ పరిధిలో ఉండటం గమనార్హం. అదికూడా తమకు ఎలాంటి సంబంధంలేని ఎఫ్‌పీ షాపునెం: 2281047 పరిధిలో 2015నుంచి రేషన్‌కార్డు ఉన్న వున్నం కృష్ణవేణి కుటుంబంలో.. మౌనిక కుటుంబసభ్యులను చేర్చడం శోచనీయం. అయితే దరఖాస్తుదారు ఖమ్మం అర్బన్ పరిధిలో ఉన్న కార్డులో తమ వివరాలను డిలీట్ చేయాలని ఖమ్మం అర్బన్ అధికారులకు దరఖాస్తు పెట్టుకోవాలని, అనంతరం కొత్త కార్డుకోసం మీ సేవలో అప్లై చేసుకోవాలంటూ అధికారులు సూచించడం కొసమెరుపు. అదేకార్డు వేరే ఏదైనా జిల్లాలో ఉంటే పరిస్థితి ఏంటో అధికారులకే తెలియాలి మరి.




ప్రజాపాలనలో మౌనిక చేసుకున్న దరఖాస్తు

మీ 'సేవ'కు అంకితం

- కొత్త రేషన్‌కార్డులపై అయోమయం
- మీ సేవల ద్వారా వచ్చిన దరఖాస్తులకే అధికారుల ప్రాధాన్యం
- ప్రజాపాలన అప్లికేషన్లపై పట్టింపేదీ?
- దాంతో మళ్లీ మీ సేవా కేంద్రాలకే పరుగు తీసుకున్న ప్రజలు
- ప్రభుత్వానికి నివేదిక ఇచ్చామంటున్న అధికారులు

కొత్తగూడెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ పేదవాడి కల రేషన్‌కార్డు. గడిచిన పదేళ్ల కాలంలో నూతన రేషన్ కార్డులు లేకపోవడంతోపాటు, కనీసం మార్పులు చేర్పులకు కూడా అవకాశం లేకుండా పోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలన సమయంలోనే రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించడంతో అప్పటివరకు ఎదురు చూసిన వారంతా హర్షం వ్యక్తం చేశారు. ఆ తర్వాత స్వీకరించిన దరఖాస్తులపై విచారణ నిర్వహించినప్పుడూ ఇక తమకు రేషన్ కార్డులు వచ్చేస్తాయంటూ ఉప్పొంగిపోయారు.



కానీ ఆ దరఖాస్తుల వ్యవహారంలో అయోమయం నెలకొంది. అసలు వారు ప్రజాపాలనలో పెట్టిన దరఖాస్తులకు సంబంధించి రేషన్ కార్డులు మంజూరయ్యాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. దాంతో మీసేవ కేంద్రాల్లో సైతం దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఇవ్వడంతో చాలా మంది మీసేవ కేంద్రాలకు పరుగులు పెట్టారు. దాంతో మీ సేవా కేంద్రాల నుంచి వేలకొద్దీ దరఖాస్తులు వచ్చాయి. కాగా ఇటీవల కాలంలో ప్రభుత్వం రేషన్‌లో సన్నబియ్యం పంపిణీ చేయడంతో ఇప్పుడు రేషన్ కార్డులపై లబ్దిదారులకు మరింత ఆసక్తి పెరిగింది. దాంతో నూతన రేషన్ కార్డులు కావాలనుకున్నవారు గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసినప్పటికీ మీ సేవా కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు సైతం మీ సేవకే అంకితం అన్నట్టుగా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులకే ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అత్యధికశాతం అర్హతకలిగిన వారందరూ మీ సేవా కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకుంటున్నారు.

ప్రజాపాలన దరఖాస్తులపై గందరగోళం

ప్రజాపాలనలో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తుచేసుకున్న వారిలో గందరగోళ పరిస్థితులు నెలకొంటున్నాయి. అసలు వారికి రేషన్ కార్డు వచ్చిందో లేదో కూడా తెలియని తికమకకు గురవుతున్నారు. ప్రజాపాలన సమయంలో చాలా దరఖాస్తులు ఆన్‌లైన్ చేయలేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. వేలసంఖ్యలో అర్హత ఉన్నప్పటికీ దరఖాస్తులు ఆన్‌లైన్ చేయకపోవడంతో అనర్హులుగా మిగిలిపోయారన్న వాదన లేకపోలేదు. అలా ఆన్‌లైన్ చేయని (మిగతా 6వ పేజీలో)

అధికారిక లెక్కల ప్రకారం..		
ప్రజాపాలన దరఖాస్తులు మొత్తం	-	54,093
విచారణ జరిపినవి	-	53,219
అర్హులవిగా తేల్చినవి	-	36,828
అనర్హుల జాబితాలో పెట్టినవి	-	8,097
గతంలో కార్డులు ఉండి దరఖాస్తు చేసిన వారు	-	6,716
మీ సేవ ద్వారా వచ్చిన దరఖాస్తులు	-	34,707
ఇచ్చిన కార్డులు	-	27,276
మార్పులు చేర్పుల కోసం చేసిన దరఖాస్తులు	-	48,039
అనుమతి పొందినవి	-	43,348
తిరస్కరణకు గురైనవి	-	3,260

కొండెక్కిన కొబ్బరికాయ

ఉత్పత్తి, సరఫరా తగ్గడంతో పెరిగిన ధర

ఖమ్మం మార్కెట్ సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): దైవారాధనలో కొబ్బరికాయకున్న విశిష్టత ఏంటో తెలిసిందే. అలాంటి కొబ్బరికాయ ఎన్నడూ లేనంతగా రికార్డు ధర పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో సాధారణ కొబ్బరికాయ రూ.40 నుంచి రూ.50 పలుకుతోంది. ఆరు నెలల క్రితం వరకు రూ.20 నుంచి రూ.30 వరకు పలికిన ధర.. ప్రస్తుతం డిమాండ్ పెరగడంతో ఆ ధరలు డబుల్ అయ్యాయి. అంతే కాకుండా మార్కెట్‌లో కొబ్బరి ఉత్పత్తులైన కుడకలు కిలో రూ.330 నుంచి రూ.350 వరకు, కురిడీలు కిలో రూ.400వరకు, వంటలలో ఉపయోగించే కొబ్బరి పొడి కిలో రూ.400 వరకు పలుకుతున్నాయి. ఇళ్లు, వాకిళ్లు ఊడ్చుకునేందుకు వినియోగించే కొబ్బరి పుల్లల చీపుర్లు సైతం ఒక్కొక్కటి రూ.35 నుంచి రూ.40కి చేరడం విశేషం. కొబ్బరి అధికంగా పండించే రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడులో కొబ్బరి దిగుబడి భారీగా పడిపోవడం, డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. గతేడాది మేలో వెయ్యి కొబ్బరి కాయల లాట్ రూ.12వేలు పలుకగా ఈ ఏడాది రూ.22వేల నుంచి రూ.23వేల వరకు పలుకుతుండటం విశేషం. పెరిగిన ధరలతో కొబ్బరి రైతులు ఆనందపడుతుండగా వినియోగదారులు బెంబేలెత్తిపోతున్నారు.



మరో పది రోజుల్లో..

- కనుమరుగుకానున్న వెంకటేష్ ఖని గ్రామపంచాయతీ
- 21లోపు ఖాళీ చేయాలని స్థానికులకు నోటీసులు
- ఓసీ రాకతో ముగియనున్న 30ఏళ్ల ప్రస్థానం
- గంగాబిషన్ బస్తీలోని 'నిర్వాసిత' స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవడంపై ఆవేదన
- ఆర్థికంగా సహకరించాలంటూ కలెక్టర్, సింగరేణి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు

7



కనుమరుగుకానున్న వెంకటేష్ ఖని గ్రామ పంచాయతీలోని ఇళ్లు

ట్రాక్టరుకు రూ.2వేలు!

- ఇసుక బండి కదలాలంటే చెల్లించాల్సిందే మరి..
- మున్నేటి నడిబొడ్డున ఇసుకాసురుల దందా
- గేటు ఏర్పాటు చేసి.. సీసీ కెమెరాల సాక్షిగా వసూళ్లు
- ఇందిరమ్మ ఇళ్లకు భారంగా మారిన ఇసుక రవాణా

చింతకాని, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మున్నేటి ఇసుక ప్రైవేటు వ్యక్తులకు కాసులు కురిపిస్తోంది. రాజకీయ నాయకులు, అధికారుల అండతో సదరు వ్యక్తుల దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఓ వ్యక్తి సొంతంగా సైన్యాన్ని ఏర్పాటు చేసి ఇష్టారీతిన వసూళ్లకు పాల్పడుతూ రూ.కోట్లు ఆర్జించాడు. ప్రశ్నించేవాడు లేకపోవడంతో అతడు ఆడిందే ఆటగా.. పాడిందే పాటగా దందా సాగుతోంది. ఇసుక రవాణాకు అనుకూలంగా ఉండేందుకు మున్నేటిని చీల్చుతూ తాత్కాలిక రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేసి.. నడిబొడ్డున గేటు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇసుక తరలించే ట్రాక్టర్ల వారి వద్ద వసూళ్లకు తెరలేపాడు. ఈ క్రమంలో ట్రాక్టర్‌కు రూ.2వేలు చెల్లించాల్సిందే హుకుం జారీ చేసి.. మరీ జేబు నింపుకొంటున్నాడు. ఈ క్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం ఉచితంగా ఇసుక తరలించుకోవాల్సిన లబ్ధిదారులు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తి (ఫైల్)

ఒక్కో ట్రాక్టర్‌కు రూ.2వేలు వసూలు..

ప్రస్తుతం పట్టణాలు, గ్రామాల్లో ఇంటి నిర్మాణాలతో పాటు మరమ్మతు పనులు ఊపందుకోవడం, వేలాది మంది పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవడంతో ఇసుకకు భారీగా డిమాండ్ పెరిగింది. ఖమ్మం పరిసర ప్రాంతాలు, చింతకాని, బోనకల్, కొణిజర్ల మండలాల్లోని గ్రామాల్లో ఇంటి నిర్మాణాలకు మున్నేరు ఇసుకే దిక్కు. దీంతో మున్నేరు నుంచి రోజుకు వందల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుక (మిగతా 8వ పేజీలో)

నూతన ఈవోకు ఆభరణాల అప్పగింత ప్రారంభం

భద్రాచలం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి చెందిన స్వామి వారి బంగారు, వెండి ఆభరణాలను అప్పగించే కార్యక్రమం ప్రారంభమైంది. గతంలో భద్రాచలం దేవస్థానం ఈవోగా బాధ్యతలు నిర్వహించి ప్రస్తుతం వేములవాడ దేవస్థానం ఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎల్.రమాదేవి గురువారం ఆభరణాల అప్పగింత కోసం భద్రాచలం వచ్చారు. ఈ క్రమంలో ఆమె భద్రాచలం ప్రస్తుత దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావుకు బంగారు, వెండి ఆభరణాలను అప్పగించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కాగా మరో రెండురోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు దేవస్థానం వర్గాల ద్వారా తెలుస్తోంది. స్వామి వారికి వినియోగించే ఆభరణాలతో పాటు బ్యాంకులో, మ్యూజియంలో భద్రపరిచిన ఆభరణాలను నిబంధనల మేరకు గతంలో పని చేసిన ఈవో ప్రస్తుత ఈవోకు అప్పగించాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉండగా అంతకు ముందు వేములవాడ దేవస్థానం ఈవో రమాదేవి రామాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా వేద పండితులు ఆశీర్వచనం పలికారు. బంగారు ఆభరణాల అప్పగింత కార్యక్రమంలో ఇరువురు ఈవోలతో పాటు ఏఈవోలు శ్రవణ్‌కుమార్, భవానీ రామకృష్ణారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షమించదు

- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం మహత్తర ఘట్టం
- వారోత్సవాలను ప్రారంభించిన బాగం హేమంతరావు

7



నల్లమల్ల గిరిప్రసాద్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బాగం హేమంతరావు

కష్టాల.. కన్నీటి సాగు!

- పత్తి రైతును కనికరించని కాలం
- నట్టేట ముంచిన అకాల వర్షాలు దిగుబడులు రాక రైతుల పరేషాన్
- అప్పుల భారంతో కుంగుబాటు
- బయట పడే దారేది?



6

కష్టాల.. కన్నీటి సాగు!



దెబ్బతిన్న పత్తి పంట



వర్షాభావంతో పూత, కాపు లేకుండా ఉన్న పత్తి

పత్తి రైతును కనికరించని కాలం
నట్టేటా ముంచిన అకాల వర్షాలు
దిగుబడులు రాక రైతుల పరేషాన్
అప్పుల భారంతో కుంగుబాటు
బయట పడే దారేది?

బోనకల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పుడమి తల్లిని నమ్ముకొని హలం చేతబూనిన అన్నదాతలకు ఏదో ఒక రూపంలో కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. ప్రతి ఏటా గంపెడాశతో పంటలు సాగు చేస్తున్న రైతన్నలను ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఏటికి ఎదురీదినట్లుగా.. అన్ని భరిస్తూ చేస్తున్న ఆశల సాగు ఈ ఏడాది కూడా వారిలో నైరాశ్యాన్ని నింపింది. పత్తి రైతును కాలం కనికరించక పోవడంతో కన్నీళ్ల కష్టాలతోనే సాగును కొనసాగిస్తున్నారు. జిల్లాలోనే వ్యవసాయ మండలంగా పేరున్న బోనకల్ మండలంలో ఈ ఏడాది అత్యధికంగా 18 వేల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారు. వేసవిలోనే వర్షాలు పడడంతో.. ఈ ఏడాది వ్యవసాయ సీజన్ రాక ముందే రైతులు రెట్టింపు ఉత్సాహంతో పత్తి విత్తనాలు వేశారు. తొలుత వర్షాలు, వాతావరణం బాగుండడంతో పైరు ఏపుగా పెరిగింది. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. తానొకటి తలిస్తే దైవమొకటి తలిచినట్లుగా.. పత్తి పూత, కాపు దశలో ఉన్న తరుణంలో అకాల వర్షాలు వెంటాడాయి. పొలాల్లో నీళ్లు నిలిచినందు వల్ల తేమ ప్రభావంతో పూత, కాత రాలడంతో పాటు ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపింది.

రైతులకు తప్పని దిగుబడుల పరేషాన్

పత్తి పైరు సాగుకు దుక్కులు, కూలీలు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నివారణకు సంబంధించి ఇప్పటికే ఒక్కో ఎకరానికి దాదాపు రూ. 25 వేలు పెట్టుబడి అయ్యింది. కౌలు రైతులకు కౌలు మరో రూ. 20వేలు అదనం. అకాల వర్షాల వల్ల ఎకరానికి కనీసం 5 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే అవకాశం లేదని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్పుల భారంతో కుంగుబాటు

రైతులు అందిన ప్రతీచోట అప్పులు తెచ్చి ఆశల సాగుకు శ్రీకారం చుట్టారు. కానీ కాలం కలిసి రాక పోవడంతో అప్పుల భారం వారిని కుంగుబాటుకు గురి చేసింది. తక్కువ దిగుబడులు వచ్చే అవకాశం ఉండడంతో.. అప్పు తెచ్చి పెట్టిన పెట్టుబడులైనా తీరతాయో? లేదోనన్న ఆందోళనలో ఉన్నారు. అధిక వడ్డీలకు తెచ్చి పెట్టుబడులు పెట్టిన తమను పత్తి సాగు ఈ ఏడాది కూడా కష్టాల కడలిలోకి నెట్టిందనే మనోవేదనలో అన్నదాతలు ఉన్నారు.

పత్తి సాగు నష్టాన్ని మిగిల్చింది

లాల్ బహదూర్ శాస్త్రి (రైతు, ముష్టికుంట్ల)



12 ఎకరాల కౌలు పొలంలో పత్తి పంట సాగు చేశాను. పూత, కాపు దశలో ఎడతెరిపి లేని వర్షాల వల్ల ఎదుగుదల, దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. ఎన్నో ఆశలతో పత్తి పంటను సాగు చేస్తే అధిక వర్షాలు తమను నట్టేట ముంచాయి. కోలుకోలేని విధంగా నష్టాలను మిగిల్చాయి.

పత్తిసాగు అప్పుల భారాన్ని పెంచింది

బంధం నాగేశ్వరరావు (రైతు, ముష్టికుంట్ల)



ఈ ఏడాది పత్తి సాగు అప్పుల భారాన్ని పెంచింది. నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి పంటను సాగు చేశాను. కౌలుతో పాటు పెట్టుబడి కలిపి ఎకరానికి రూ. 50 వేల వరకు ఖర్చు చేశా. అధిక వర్షాల వల్ల పూత, కాపు దశలో ఉన్న పైరు పూర్తిగా దెబ్బతింది. ఎకరానికి రెండు క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి కూడా కనిపించడం లేదు.



దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

వేంసూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నకిలీ వరి విత్తనాలు సాగుచేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వేంసూరు మండలం కందుకూరు గ్రామంలో నకిలీ విత్తనాలతో దెబ్బతిన్న వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కరీంనగర్ వరుణ్ అగ్రిటెక్ కంపెనీకి చెందిన బీపీటీ2782రకం వరి విత్తనాలను మండలంలోని పలు గ్రామాల్లోని రైతులు సాగుచేశారని తెలిపారు. అధిక దిగుబడులు వస్తాయని, సన్నరకం ధాన్యానికి బోనస్ వస్తుందనే ఆశతో రైతులు ఈరకం విత్తనాలను సాగు చేసి నష్టపోయారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ ముందు జాగ్రత్త చర్యతోనే మే, జూన్ నెలల్లోనే రైతులకు యూరియా అందించారని ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా రైతులకు సకాలంలో సరిపడా యూరియా సరఫరా చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దొడ్డా వెంకటకృష్ణారెడ్డి, కంటే వెంకటేశ్వరరావు, మందపాటి మహేశ్వర్‌రెడ్డి, రావూరి శ్రీనివాసరావు, రామ్మోహన్‌రెడ్డి, గంధ్ర సోమిరెడ్డి, వెంకటేశ్వరరావు, గరిగింటి రాంబాబు, శ్రీధర్, రైతులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ నోటీసులు

పెసా చట్టం అమలు విషయమై జారీ

వివరాలు వెల్లడించిన ఏన్కూరు మాజీ ఎంపీపీ వరలక్ష్మి

ఏన్కూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి):పెసా చట్టాన్ని సక్రమంగా ఎందుకు అమలు చేయడం లేదంటూ జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ ఢిల్లీ నుంచి కలెక్టర్‌కు ఇటీవల నోటీసులు జారీ అయ్యాయి. ఈమేరకు ఏన్కూరు మాజీ ఎంపీపీ ఆరెం వరలక్ష్మి నోటీసు ప్రతులను గురువారం విలేకరులకు అందించారు. ఈ సందర్భంగా ఆమె పలు వివరాలు తెలిపారు. పెసాచట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ తాను ఎంపీపీగా ఉన్న సమయంలో 2024 అక్టోబరు 29న జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు చేశానన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల విస్తీర్ణ 1996 పెసా చట్టం పూర్తిగా అమలు కావడం లేదని, గ్రామస్థాయిలో సభలు నిర్వహించడం లేదని, గ్రామసభ తీర్మానం లేకుండానే అభివృద్ధి పనులు చేస్తున్నారని ఆ లేఖలో ఫిర్యాదు చేశామన్నారు. పెసాచట్టం అమలు సక్రమంగా జరగకపోవడం వల్ల ఆదివాసీలు స్థానిక స్వపరిపాలన, సంప్రదాయ హక్కులు, వనరులను గిరిజనులు కోల్పోతున్నారని వివరించామన్నారు. అందుకు స్పందించిన జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ పెసా చట్టాన్ని ఎందుకు అమలు చేయడంలేదో లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వాలని 2024నవంబరు 11న కలెక్టర్‌కు నోటీసులు జారీ అయ్యాయన్నారు. అయితే అప్పటి ఆ నోటీసులకు సమాధానాలు ఇవ్వకపోవడంతో.. మళ్లీ రెండోసారి ఈ నెల 1న నోటీసులు జారీచేశారన్నారు. ఈ నోటీసులకు కూడా సమాధానం ఇవ్వకుంటే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని అందులో కమిషన్ పేర్కొందని ఆమె తెలిపారు. ఇకనైనా కలెక్టర్ స్పందించి ఆ నోటీసులకు జవాబు ఇవ్వాలని వరలక్ష్మి కోరారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి



రామాలయంలో పూజలు చేస్తున్న నాగరిగారి ప్రీతం

రాజీవ్ యువవికాసం ద్వారా త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 5లక్షల మందికి రుణాలు

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం

జూలూరుపాడు / భద్రాచలం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా యువతకు ఉపాధి అవకాశాలను కల్పించి, ఎస్సీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలుచేసిన దళితబంధు పథకం ద్వారా జూలూరుపాడుకు చెందిన మోదుగు రామకృష్ణ రుణాన్ని పొంది పెయింటింగ్ షాపును ఏర్పాటుచేశారు. దీంతో గురువారం జూలూరుపాడులోని ఆయన దుకాణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్‌యువవికాసం పథకం అమలులో కొన్ని న్యాయ చిక్కులు రావడంతో అమలులో ఆలస్యమైందన్నారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రారంభించి రాష్ట్రంలో ఎస్సీ, బీసీలకు చెందిన 5లక్షల మంది యువతకు రుణాలను మంజూరు చేసి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్‌నాయక్, మోదుగు రామకృష్ణ, నాగరాజు, గోపురామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని రాష్ట్ర ఎస్సీ కార్పోరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం గురువారం దర్శించి.. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం సంక్షేమ పథకం అమలుపై బీఆర్ఎస్ న్యాయస్థానంలో కేసు వేసిందని.. అయినప్పటికీ పథకాన్ని ఆపకుండా ఉండేందుకు తాము న్యాయస్థానంలో పిటిషన్ వేశామన్నారు. కేటీఆర్ పర్యటనల వల్ల ఉపయోగం లేదన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అనంతరం దళిత కాంగ్రెస్ అవగాహన సదస్సులో రాష్ట్ర అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పొదెం వీరయ్య మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు, కులాలు, మతాలు, జాతులను కలిపిన సమగ్ర పార్టీగా కాంగ్రెస్ నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, పీసీసీ సభ్యులు నల్లపు దుర్గాప్రసాద్, చింతిర్యాల రవికుమార్, సరెళ్ల నరేష్ పాల్గొన్నారు.

భద్రాచలం వచ్చిన డిప్యూటీ ఆర్ఎం

- ఆర్టీసీ ఉద్యోగులతో మాట్లాడిన మల్లయ్య
- సమస్యలు విన్నవించిన టిమ్స్ డ్రైవర్లు

భద్రాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో గత నాలుగు రోజులుగా విధులకు హాజరు కాకుండా నిరసన తెలుపుతున్న టిమ్స్ డ్రైవర్లతో మాట్లాడేందుకు డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య గురువారం భద్రాచలానికి వచ్చారు. భద్రాచలం ఆర్టీసీ డిపోలో డీఎం తిరుపతితో పాటు టిమ్స్ డ్రైవర్ల ప్రతినిధులు ఇందులో పాల్గొని తమ డిమాండ్లను వివరించారు. టిమ్స్ డ్రైవర్లకు అదనపు డ్రైవర్ లేదా కండక్టర్‌ను తప్పకుండా ఇవ్వాలని, అలాగే భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు మూడు మస్టర్లు ఇవ్వాలని వారు డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య దృష్టికి తీసుకొచ్చారు. అయితే ఈ డిమాండ్లపై ఉన్నతాధికారులతో డిప్యూటీ ఆర్ఎం మాట్లాడినట్లు సమాచారం. కాగా.. రెండో విడతగా సాయంత్రం సైతం ఇరుపక్షాల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. రాత్రి వరకు ఎలాంటి స్పష్టత ఇంకా రాలేదని ఆర్టీసీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. అంతకుముందు ఆర్టీసీ టిమ్స్ డ్రైవర్ల డిమాండ్లను పరిష్కరించాలంటూ ఖమ్మం రీజియన్‌లోని ఆర్టీసీ ఉద్యోగులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కాగా.. టిమ్స్ డ్రైవర్ల నిరసన నేపథ్యంలో నాలుగో రోజు కూడా టిమ్స్ సర్వీసులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా పూర్తిస్థాయిలో సర్వీసులు నడవలేదు. దీంతో సరిపడా బస్సు సర్వీసులు లేకపోవడంతో.. ప్రయాణికులు కొంత మేర ఇబ్బందులు పడ్డారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దమ్మపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండుగులపల్లి గ్రామానికి చెందిన సిద్దినేని రమేష్ ఆలియాస్ చినబక్కయ్య (30) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తూ మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది బుధవారం సాయంత్రం ఇంటి వద్దనే గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని భార్య సిద్దిన పుల్లమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై గోడ కూలి...

దమ్మపేట, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): గోడ కూలిన ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన లచ్చాపురంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిబ్బగూడెం గ్రామానికి చెందిన రావులసాయి ట్రాక్టర్‌ను అతి వేగంగా నడుపుతూ లచ్చాపురం గ్రామంలో రోడ్డు పక్కనే ఉన్న నాగిరెడ్డి కృష్ణకు చెందిన ఇంటి గోడను బుధవారం సాయంత్రం ఢీకొట్టడంతో గోడ కూలి పడిపోయింది. కాగా గోడ పక్కనే కూర్చుని ఉన్న కృష్ణ అమ్మమ్మ అబ్బిశెట్టి నారాయణమ్మ(65) తీవ్రంగా గాయపడింది. వైద్యం కోసం ఖమ్మం వైద్యశాలకు తరలించి, చికిత్స చేస్తుండగా గురువారం మృతి చెందింది. నాగిరెడ్డి కృష్ణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ద్విచక్రవాహనదారుడు..

కల్లూరు, సెప్టెంబరు11 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని చిన్నకోరుకొండి గ్రామం వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ ద్విచక్రవాహనదారుడు మృతి చెం దాడు. మండలంలోని చిన్నకోరుకొండి గ్రామానికి చెందిన జూపల్లి లక్ష్మీనర్సు(60) గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై మర్లపాడు క్రాస్ రోడ్డు వద్ద నుంచి ఇంటికి వెళుతుండగా మధిర వైపు నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో లక్ష్మీనర్సు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వైద్యం కోసం కల్లూరుకు తీసుకోవస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య, ముగురు పిల్లలు ఉన్నారని తెలిసింది. కల్లూరు పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

సీసీఐ నిబంధనలు..
పత్తి కొనుగోళ్లకు అడ్డంకులు!

(5వ పేజీ తరువాయి)

కేంద్రం పెట్టికొంటామని నిబంధనలు పెట్టడంతో దూరప్రాంతాలకు తీసుకెళ్లలేక స్థానిక దళారులకే తక్కువధరకే పత్తిని విక్రయిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 9చోట్ల..

ఉమ్మడి జిల్లాలో పత్తి పెద్దఎత్తున సాగు చేస్తున్నా కొనుగోలు కేంద్రాలు స్వల్పంగా సీసీఐ ఏర్పాటు చేస్తుంది. ఖమ్మంజిల్లాలో ఐదు చోట్ల, భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలో నాలుగు చోట్ల మాత్రమే సీసీఐ కొనుగోలు కేంద్రాలను తెరుస్తుంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌పరిధిలో జిన్నింగ్ మిల్లు లేకపోవడంతో ఖమ్మంరూరల్ మండలం గుర్రాలపాడు వద్ద కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేసి రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, ఖమ్మంఅర్బన్, కామేపల్లి తదితర మండలాల పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సమీపంలో గతంలో సీసీఐ కొనుగోలు కేంద్రం ఉండేది. దీంతో పత్తి రైతులు మార్కెట్‌లో తక్కువ ధర పలకగానే మార్కెట్ సమీపంలోని సీసీఐకు పత్తిని అమ్మే పరిస్థితి ఉండేది. పత్తి మార్కెట్‌లోనే సీసీఐ కేంద్రం ఉంటే ప్రైవేటు వ్యాపారులు కూడా రైతులకు పోటీ పెట్టి ధర చెల్లించే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆపరిస్థితి ఉండడంలేదు. ఖమ్మం జిల్లాలో ఖమ్మం, మద్దులపల్లి, నేలకొండపల్లి, మధిర, వైరా మార్కెట్ల పరిధిలో ఐదు చోట్ల సీసీఐ కొనుగోలు కేంద్రాలు పెట్టాలని మార్కెటింగ్‌శాఖ ప్రతిపాదన చేసింది. అయితే పేరుకు మార్కెట్ కమిటీ కొనుగోలు కేంద్రం అయినా జిన్నింగ్ మిల్లులు ఎక్కడ ఉంటే అక్కడకే రైతులు తీసుకునిపోయే పరిస్థితి ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇల్లెందు, కొత్తగూడెం జిన్నింగ్‌మిల్లులతో పాటు బూర్గంపాడులోని రెండు జిన్నింగ్ మిల్లులు కలిపి నాలుగు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇల్లెందు మార్కెట్ పరిధిలో జిన్నింగ్ మిల్లు ఇల్లెందులో లేదు. కారేపల్లిలో ఉండడంతో ఇల్లెందు మార్కెట్ కమిటీ పరిధిలోని పత్తి కారేపల్లిలో అమ్ముకోవాలి. అలాగే కొత్తగూడెం మార్కెట్ పరిధిలోని పాల్వంచ, లక్ష్మీదేవిపల్లి, చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లిసమీప మండలాల్లో జిన్నింగ్ మిల్లులేదు. కొత్తగూడెం మార్కెట్ పరిధిలోని కొనుగోలు కేంద్రం సుజాతనగర్‌లో జిన్నింగ్ మిల్లు ఏర్పాటుచేస్తే అక్కడకు తెచ్చి పత్తి అమ్మాలి. వాస్తవానికి జూలూరుపాడు మండలంలో అత్యధికంగా పత్తి సాగవుతుంది. జూలూరుపాడులో జిన్నింగ్ మిల్లు లేకపోవడంతో అక్కడ రైతులు స్థానిక వ్యాపారులకే అమ్ముకుంటున్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి కూడా జూలూరుపాడు వచ్చి పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయడం లేదు. ఈఏడాది సీసీఐ క్వింటాకు రూ.8,110లు మద్దతు ధర ప్రకటించింది. గతేడాది రూ.7521 ప్రస్తుతం పత్తి మార్కెట్‌లో క్వింటాకు నాణ్యత రూ.7,400 ధర వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు.

అధికారులు దృష్టిసారించాలి

పత్తి కొనుగోలు సీజన్ రాబోతున్నందున పత్తి రైతుల ఇబ్బందులను తొలిగించేందుకు వ్యవసాయ, మార్కెటింగ్, రెవెన్యూ శాఖ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వ్యవసాయశాఖ పంట నమోదు ఇంకా అన్ని గ్రామాల్లో జరగలేదు. సీసీఐకి పత్తి అమ్మాలంటే పంటలు నమోదు జరిగినట్టు మండల వ్యవసాయాధికారి నుంచి ధ్రువీకరణతో పాటు క్రాప్ బుకింగ్ యాప్‌లో సర్వే పూర్తవ్వాలి. ఇంకా ఇది జరగకపోవడంతో కొందరు వ్యాపారులు వ్యవసాయాధికారుల నుంచి తప్పుడు ధ్రువీకరణ పత్రాలు తీసుకుని సీసీఐకి పత్తి అమ్మి లబ్ధి పొందుతున్నారు. గతేడాది మార్కెటింగ్ శాఖ అధికారులు పలువురు కార్యదర్శులను సస్పెండ్ చేయడంతోపాటు ప్రభుత్వం విచారణ కూడా నిర్వహించింది. ఈసారి సర్వే పకడ్బందీగా ఉంటేనే రైతుల ఇబ్బందులు తొలుగుతాయి. అలాగే జిన్నింగ్ మిల్లుతో సంబంధం లేకుండా వ్యవసాయ మార్కెట్‌లోని పత్తి మార్కెట్ సమీపంలోనే సీసీఐ కొనుగోలుకేంద్రం ఏర్పాటు చేయిస్తేనే రైతుకు గిట్టుబాటు ధర వచ్చే అవకాశం ఉంటుంది. ప్రైవేటు వ్యాపారుల కూడా ధర తగ్గించకుండా కొనుగోలు చేసే పరిస్థితి ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. జిన్నింగ్ మిల్లుల వద్ద కాకుండా పత్తి పండే మండలాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఎక్కువసంఖ్యలో ఏర్పాటుచేస్తే పత్తి రైతుకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుంది.

'మీసేవ'కు అంకితం!

(5వ పేజీ తరువాయి)

దరఖాస్తుల్లో రేషన్ కార్డులకు సంబంధించినవి బోలెడు ఉన్నాయన్న విమర్శలు లేకపోలేదు. కాగా అధికారిక లెక్కల ప్రకారం ప్రజాపాలనలో భాగంగా జిల్లాలో 54,093 దరఖాస్తులు రాగా.. వాటిల్లో 874 దరఖాస్తులపై ఇంకా విచారణ జరపలేదు. 53,219 దరఖాస్తులు విచారణ జరపగా 36,828 దరఖాస్తుదారులను అర్హులుగా గుర్తించారు. 6,716 దరఖాస్తులు గతంలోనే ఉన్నట్టుగా జిల్లాస్థాయి అధికారులు నివేదిక ఇచ్చారు. అయితే ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నవారికి కూడా రేషన్ కార్డులు మంజూరు చేశామని అధికారులు చెబుతున్నా.. ఆ లెక్కలు ఎవరికీ తెలియని పరిస్థితి. ఆన్‌లైన్ పూర్తయిన తర్వాత కూడా చాలామందికి రేషన్ కార్డులు రాని పరిస్థితి కనిపిస్తోంది. మరికొన్ని సందర్భాల్లో కార్డులు ఎక్కడ మంజూరయ్యాయో కూడా తెలియని దుస్థితి నెలకొంది.

మళ్లీ మీసేవా కేంద్రాల వద్దకే...

ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి తమకు రేషన్ కార్డులు మంజూరయ్యాయో లేదో తెలియని పరిస్థితి ఉండటంతో గతంలో దరఖాస్తు చేసిన వారు, ప్రస్తుతం నూతనంగా దరఖాస్తు చేసుకున్న వారు మీ సేవా కేంద్రాల వద్దకు వెళ్తున్నారు. మరికొన్ని సందర్భాల్లో తమకు రేషన్ కార్డు వచ్చిందో రాలేదో తెలుసుకునేందుకు కూడా మీ సేవా కేంద్రాలనే ఆశ్రయించాల్సి వస్తోందని దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీ సేవా కేంద్రాల వద్దకు వెళ్లిన సమయంలో సంబంధిత దరఖాస్తుదారుడు ఆధార్ నెంబర్ కొట్టినప్పుడు మాత్రమే వారికి రేషన్ కార్డు మంజూరు అయిందో లేదో తెలుసుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలనలో కొందరు దరఖాస్తుదారులను అనర్హులుగా చూపిస్తూ నివేదిక ఇచ్చిన నేపథ్యంలో వారు కార్డుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందన్న వాదన లేకపోలేదు. ఇదిలా ఉంటే అసలు ప్రజాపాలనకు సంబంధించి ఎంతమందికి రేషన్ కార్డులు మంజూరయ్యాయనే విషయంపై అధికారులకు స్పష్టత లేకపోవడం కొసమెరుపు. వారు కేవలం ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులకు ఆన్‌లైన్ పూర్తయిన తర్వాత విచారణ నిర్వహించి అర్హుల జాబితాను ప్రభుత్వానికి నివేదించామని మాత్రమే కొందరు అధికారులు చెబుతున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో అయితే ప్రజాపాలనలో పెట్టిన దరఖాస్తులు, విచారణ కేవలం అర్హుల జాబితాను రూపొందించడానికి మాత్రమేననీ, అందులో అర్హత ఉన్నప్పటికీ మళ్లీ మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాల్సిందేనంటూ ప్రచారం జరుగుతోండటంతో వారు మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. మొత్తానికి ప్రజాపాలనలో పెట్టిన దరఖాస్తులపై పూర్తిస్థాయి స్పష్టత లేకపోవడంతో.. రేషన్ కార్డులకు సంబంధించిన అంశం 'మీ సేవ'కు అంకిత అన్నట్టుగా తయారైంది.

పది నెలలుగా జీతాల్లేవు..

- ఉన్న జీతాలు తగ్గించేందుకు సిద్ధమైన ప్రభుత్వం
- గిరిజన శాఖ మంత్రితో చర్చలు విఫలం
- నేటి నుంచి సమ్మెలోకి పోస్టు మెట్రిక్ హాస్టల్ సిబ్బంది
- ఉమ్మడి జిల్లాలో 220మంది డెయిలీవేజ్ కార్మికులు

భద్రాచలం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ పోస్టుమెట్రిక్ హాస్టళ్లలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్లనున్నట్లు గిరిజన సంక్షేమ శాఖ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రకటించింది. గురువారం హైదరాబాద్‌లో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలను జిల్లాకు చెందిన సంక్షేమ శాఖ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయు అనుబంధం) రాష్ట్ర కార్యదర్శి కె.బ్రహ్మచారి వెల్లడించారు. పది నెలలుగా వేతన బకాయిలు తక్షణమే చెల్లించాలని, జీవో నెం.60 ప్రకారం రూ.15,600 వేతనాలు చెల్లించాలని క్యాటరింగ్ విధానం పేరుతో రూ.12,500 వస్తున్న వేతనాలను రూ.9,200కు తగ్గించడాన్ని వ్యతిరేకిస్తూ సమ్మెలోకి వెళ్తున్నామన్నారు. ఇప్పటికే అనేకసార్లు మంత్రులు, అధికారులకి వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి పురోగతి లేదని, ప్రజాభవన్ వద్ద ధర్నా చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్యాటరింగ్ విధానాన్ని రద్దు చేసి రూ.15,600 జీతం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేసేంత వరకు వంటలు పూర్తిగా బంద్ చేసి సమ్మెను కొనసాగించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ మేరకు వినతిపత్రంను గిరిజన సంక్షేమ శాఖ మంత్రికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర కన్వీనర్లు బి.మధు, మాడే పాపారావు, సురేందర్, బి.నాగేశ్వరరావు, గోపాల్ పాల్గొన్నారు. అయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 33పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లు ఉండగా 138మంది, 82ఆశ్రమ పాఠశాలల్లో ఉన్న 568 డెయిలీవేజ్ సిబ్బంది సమ్మెకు దిగనున్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

దర్జాగా మట్టి తోలకాలు...

- ఫిర్యాదులతో క్వారీలను పరిశీలించిన అధికారులు



క్వారీలను పరిశీలిస్తున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు

బోనకల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం, చిరునోముల రెవెన్యూ పరిదిలో మట్టి క్వారీలు ఉన్నాయి. కొన్ని ప్రభుత్వ భూముల్లో కూడా మట్టి ఉంది. ఎలాంటి అనుమతులు లేకుండానే గత నెల రోజులుగా ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నాయి. రోజువారీ అధిక ట్రిప్పులు వేసేందుకు గానూ తోలకదారులు రోడ్ల పై అతివేగంతో ట్రాక్టర్ల నడుపడం వలన ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ట్రాక్టర్ మట్టి రూ. 2300 వరకు వసూలు చేస్తున్నారు. మట్టి తోలకాలకు సంబంధించి అధికారులు పట్టించుకోకపోవడం అక్రమార్కులకు రాజమార్గంగా మారింది. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కొందరూ దళారులు రంగ ప్రవేశం చేసి దర్జాగా మట్టి అమ్మకాల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయల చందానా సాగిస్తున్నారు.

అక్రమ మట్టి తోలకాలకు సంబంధించి గ్రామాల్లో ప్రజలు జిల్లా అధికారులకు వరుస ఫిర్యాదులు చేస్తుండటంతో ఎట్టకేలకు గురువారం అధికారులు లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలోని మట్టి తవ్వకాల క్వారీని పరిశీలించారు. అప్పటికే అధికారుల రాకను పసిగట్టిన తోలకదారులు అప్రమత్తమయ్యారు. అక్కడ నుంచి ట్రాక్టర్లను తీసుకొని వెళ్లిపోయారు. కేవలం యంత్రాలు మాత్రమే తవ్వకాల వద్ద ఉండటంతో పంచనామా నిర్వహించారు. మండలంలో మాత్రం మట్టి తోలకాలను అడ్డుకునే నాధుడే లేరని, దీంతో అక్రమ మట్టి తోలకాల జోరు ఆగదని బహిరంగంగానే ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఖమ్మం రూరల్: ఖమ్మం రూరల్ మండలం, కాచిరాజుగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని రేగుల తండా గ్రామం పక్కన ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూముల గుండా కొందరు మట్టి వ్యాపారులు పెద్ద పెద్ద లారీలతో నిత్యం వందల ట్రిప్పుల మట్టి తోలకాలు నిర్వహిస్తున్నారు. ఈ దందా సుమారు రెండు నెలలుగా సాగిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే అక్రమంగా మట్టి దందా సాగిస్తున్నారని వాపోతున్నారు. అంతేకాకుండా నిత్యం పగలు, రాత్రి అనే తేడా లేకుండా తోలకాలు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు సమాచారం అందించినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గ్రామంలో నెమ్మదిగా వెళ్లాలని చిన్నపిల్లలు తిరుగుతున్నారని గ్రామస్థులు లారీల డ్రైవర్లకు చెపితే వారు గ్రామస్థులపైకి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కాగా గురువారం గ్రామం నుంచి లారీలు తిరగకుండా గ్రామస్థులు అడ్డుకున్నారు. గ్రామస్థుల సమాచారం మేరకు పోలీసులు గ్రామానికి చేరుకున్నారు. అనంతరం పోలీసులు గ్రామస్థులతో మాట్లాడటంతో లారీలను వదిలిపెట్టారు. గ్రామానికి చెందిన ధారావత్ ఉపేందర్ అనే యువకుడు మట్టి వ్యాపారులపై రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆల్ ఇండియా షటిల్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన ఆంజనేయులు

దుమ్ముగూడెం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్లగూడెం గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు శ్యామల అంజనేయులు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ స్పోర్ట్స్ టోర్నమెంటు-2025 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 6న తెలుత జిల్లా స్థాయిలో 30 మందితో పోటీపడి మొదటి స్థానాన్ని దక్కించుకున్నారు. హైదరాబాదులో సెప్టెంబరు 9, 10 తేదీల్లో జాతీయస్థాయి పోటీల్లో అర్హత సాధించాడు. ఇటీవల భద్రాచలం ఐటీడీఏలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఐటీడీఏ పీవో బి.రాహుల్ చేతుల మీదు గా అవార్డు పొందాడు. అంజనేయులును గెజిటెడ్ హెచ్ఎంలు, పీడీలు, పీఈటీలు పూనెం నర్సింహారావు, మడకం మోతీరు, కుంజా శ్రీనివాసరావు, కారం సోమశేఖర్, కుర్సం లక్ష్మణరావు, బి.కళ్యాణి, హరి తదితరులు అభినందించారు.

చరిత్రను వక్రీకరిస్తే జాతి క్షమించదు

» సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరిస్తే తెలంగాణ జాతి క్షమించదని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. గురువారం ఖమ్మం పాత బస్టాండ్ సెంటర్‌లోని నల్లమల్ల గిరిప్రసాద్ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన ఆయన.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను ప్రారంభించారు. యర్రాబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత జమ్ముల జితేందర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నిజాం రాజు తానే రాజుగా ప్రకటించుకొని ప్రజల్ని ఇబ్బందులకు గురి చేస్తుండటంతో 11సెప్టెంబరు 1947లో రావి నారాయణరెడ్డి, ముగ్దుం మొహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి తెలంగాణ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారని తెలిపారు. ఈ పోరాటంలో నాల్గున్నర వేల మంది కమ్యూనిస్టు కార్యకర్తలు అమరులయ్యారని తెలిపారు. ఎస్‌కే జానిమియా, కార్పొరేటర్ బీజే క్లైమెంట్, మహ్మద్ సలామ్, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, రావి రామకృష్ణ, తోట రామాంజనేయులు, మిడికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, శ్రీనివాస్‌రావు, సాంబశివరెడ్డి, గోవిందరావు పాల్గొన్నారు.

మందుల రికార్డులు సక్రమంగా ఉండాలి

» భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

చుంచుపల్లి, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): నిల్వ ఉన్న మందుల రికార్డులు సక్రమంగా ఉండాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. గురువారం రామవరం మాత శిశు ఆరోగ్య కేంద్రంలోని సెంట్రల్ మెడికల్ స్టోర్‌ను ఆకస్మికంగా సందర్శించి సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్‌లో నిల్వ ఉంచిన ఔషధాల లభ్యత, నాణ్యత, గడువు తేదీ, ఆసుపత్రులకు సరఫరా ప్రక్రియలను పరిశీలించారు. రోగులకు అవసరమయ్యే ఔషదాలు ఎల్లప్పుడు సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, గడువు ముగిసిన మందులను తక్షణమే తొలగించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తనిఖీ సందర్భంగా సెంట్రల్ మెడికల్ స్టోర్ సిబ్బంది కలెక్టర్ దృష్టికి పలు సమస్యలను తీసుకువచ్చారు. ప్రధాన రహదారి నుంచి స్టోర్‌కు వచ్చే రహదారి మరమ్మతులు చేయాలని, స్టోర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మందుల నిల్వ ర్యాకులు, బరువైన బాక్సులు ఎత్తడానికి అవసరమైన యంత్రాలను సమకూర్చాలని కోరారు. స్పందించిన కలెక్టర్ అవసరమైన అన్ని సదుపాయాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. స్టోర్‌లోని ఒక హాల్ ఫ్లోరింగ్ పనులు పెండింగ్‌లో ఉన్న విషయాన్ని ఆయన గమనించారు. ఈ పనులను పూర్తి చేయడానికి అవసరమైన వ్యయంపై తక్షణమే నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించి, ఫ్లోరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి వాడుకలోకి తేవాలని సూచించారు. ప్రజా ఆరోగ్యం దృష్ట్యా మెడికల్ స్టోర్ల సమర్థవంతమైన నిర్వహణ అత్యంత కీలకమని, అవసరమైన సదుపాయాల కల్పనలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. మందులు కొరత రాకుండా సంబంధిత అధికారులు అవసరమైన ఇండెంట్లు సకాలంలో పంపించాలి, ప్రతి రోగికి అవసరమైన ఔషదాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా కృషి చేయాలని సూచించారు. ప్రతీ అధికారికి, సిబ్బందికి ప్రజా ఆరోగ్యం అత్యున్నత ప్రాధాన్యతగా ఉండాలని, వైద్య రంగంలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. సీనియర్ ఫార్మసీ అధికారి శారద, ఫార్మసిస్ట్ అధికారి రామచందర్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో భాగస్వామ్యం కావాలి: ఎస్పీ

» ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఎస్పీ రోహిత్‌రాజు కోరారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీలో కళాశాల ప్రిన్సిపాల్ టి.జగన్‌మోహన్ రాజు అధ్యక్షతన జరిగిన మాదక ద్రవ్యాల అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వహించారు. యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా ఉన్నత లక్ష్య సాధన కోసం కృషి చేయాలని ఎస్పీ అన్నారు. డ్రగ్స్ నిర్మూలన కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, విద్యార్థుల దృష్టి జీవిత లక్ష్యంపై మాత్రమే ఉండాలని, నిషేధిత గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల వాడకం పట్ల ఆకర్షితులు కాకుండా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వల్ల మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పడాల్సి ఉంటుందని తెలిపారు. భద్రాద్రి జిల్లాను గంజాయి రహిత జిల్లాగా ఏర్పడడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో, విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిరంతరంగా జరుగుతున్నాయన్నారు. మత్తు పదార్థాలు అరికట్టేందుకు యువత, విద్యార్థులంతా యాంటీ డ్రగ్స్ కమిటీలో సభ్యులుగా చేరి సైనికులుగా పనిచేయాలని కోరారు. గంజాయి ఇతరత్రా మత్తు పదార్థాల విక్రయాలపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని కోరారు. కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు సోషల్ మీడియా వినియోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పాల్వంచ ఎస్ఐ సుమన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్



హాజరైన విద్యార్థులు

ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాలి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్) నుంచి ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సభ్యుడు వై.శ్రీనివాస్‌రెడ్డి కోరారు. గురువారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఆరవణలోని ఏరియా మేనేజర్ కార్యాలయంలో ఏవో రాజేంద్రబాబుకు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. కొత్తగూడెం నుంచి బెల్గావి ఎక్స్‌ప్రెస్, కాజీపేట రైళ్లను పునరుద్ధరించాలని, మణుగూరు నుంచి తిరుపతికి, షిర్డీకి ప్రత్యేక రైలు నడపాలని, కాకతీయ ఎక్స్‌ప్రెస్‌ను కొత్తగూడెం నుంచి మణుగూరు వరకు పొడిగించాలన్నారు. డోర్నకల్ నుంచి కొత్తగూడెం వరకు మంజూరైన డబ్లింగ్ రైల్వే లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, తద్వారా కారేపల్లిలో రెండో ప్లాట్ ఫామ్, కొత్తగూడెంలో మూడో నెంబర్ ప్లాట్ ఫామ్ నిర్మించాలని కోరారు. అదేవిధంగా రైల్వే స్టేషన్ పరిధిలో కొత్తగూడెం ప్రగతి మైదాన్ రాజీవ్ పార్క్‌కు వెళ్లే దారిని రీ ఓపెన్ చేయాలని, రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. జర్నలిస్టులకు, సీనియర్ సిటీజన్స్‌కు రైల్వేస్‌లో ఉచిత ప్రయాణ పాసులు కల్పించాలన్నారు. కొత్తగూడెం కేంద్రం మీదుగా కొవ్వూరు రైల్వే లైన్, భద్రాచలం మీదుగా ఛత్తీస్‌ఘడ్ కీరండోల్ వరకు రైల్వే లైన్స్ పూర్తి చేయాలన్నారు. దీంతో కొత్తగూడెం కేంద్రంగా రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయాలని తద్వారా కొత్తగూడెం ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు.

పెసరకు దక్కని మద్దతు ధర

» క్వింటా రూ.4వేలు పలుకుతున్నవైనం » మద్దతు ధర కల్పించాలని వేడుకోలు
» మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్



ప్రైవేట్‌లో పెసలు విక్రయిస్తున్న దృశ్యం

వైరా, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలతో తీవ్రంగా దెబ్బతిన్న పెసర రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వపరంగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దాంతో అరకొరగా వచ్చిన పెసల దిగుబడులను రైతులు తక్కువ ధరకు విక్రయించుకుంటున్నారు. ప్రభుత్వం నుంచి చర్యలు లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు ఇదే అదునుగా భావించి అయినకాడికి పెసర రైతులను దోచుకుంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటా ఒక్కింటికి రూ.8,682ఉంది. అయితే ఇప్పుడు ప్రైవేట్ వ్యాపారులు క్వింటా ఒక్కింటికి రూ.4వేల ధర కూడా చెల్లించడం లేదు. ఈ ఏడాది ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 18,200 ఎకరాల్లో పెసర పంట సాగుచేశారు. పెసర పంట రైతు చేతికొచ్చే సమయానికి ఎడతెరపి లేకుండా వర్షాలు కురిశాయి. మధ్యలో ఒకట్రెండు రోజులు వర్షాలు తగ్గిన సమయంలో కొంతమంది రైతులు మిషన్లతో పెసర కోయించారు. మళ్లీ తిరిగి ఎడతెరపి లేకుండా రోజుల తరబడి వర్షాలు కురిశాయి. ఫలితంగా పెసర పంట కోయకుండానే రైతులు పొలాలపైనే వదిలేశారు. మొత్తంగా 30 శాతం పెసర దిగుబడి రైతు చేతికి రాలేదు. 70శాతం పంటను నష్టపోయారు. వచ్చిన అరకొర పెసర దిగుబడులను విక్రయించుకునేందుకు ప్రభుత్వ మద్దతు ధర కరువైంది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసలు కొనుగోలు చేయాలని రైతులు ముక్తకంఠంతో నెలరోజుల నుంచి కోరుతున్నప్పటికీ అధికారులకు చీమ కుట్టినట్లుగా కూడా లేకుండాపోయింది. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసినట్లయితే వచ్చిన కొద్దిపాటి పెసర దిగుబడులకు మద్దతు ధర వచ్చేదని రైతులు ఆశపడ్డారు. ఇప్పుడు ఆ ఆశ కూడా అడిశలయ్యాయి. వర్షాలకు దెబ్బతిన్న పెసర పంట వివరాలను రైతుల నుంచి వ్యవసాయశాఖ సేకరించింది. అయితే అది కేవలం కంటితుడుపు చర్యేనని రైతులు విమర్శిస్తున్నారు. మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు క్వింటా ఒక్కింటికి రూ.4వేల ధర కూడా చెల్లించడం లేదు. ఇళ్లలో దాచుకొనే అవకాశం లేక అతి తక్కువ ధరకు రైతులు పెసలు విక్రయించుకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని మద్దతు ధర చెల్లించేందుకుగానూ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఖమ్మం మార్కెట్‌ను సందర్శించిన మార్కెటింగ్ శాఖ డైరెక్టర్



మార్కెట్‌లో నిర్మాణ పనులను పరిశీలిస్తున్న లక్ష్మీబాయి

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను గురువారం మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ లక్ష్మీబాయి సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో జరుగుతున్న పునఃనిర్మాణ పనులను ఆమె సమీక్షించారు. యార్డులలో తిరుగుతూ అధికారులకు, నిర్మాణం చేస్తున్న కాంట్రాక్టు సంస్థ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆధునిక హంగులతో పూర్తి చేసి మార్కెట్‌ను రాబోయే మిర్చి సీజన్ కల్లా రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అనంతరం మార్కెట్ అధికారులతో అంతర్గత సమావేశం నిర్వహించి మార్కెట్‌లో పంటలకు దక్కుతున్న ధరలు, రైతులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఆమె వెంట మార్కెటింగ్ శాఖ అడిషనల్ డైరెక్టర్ రవికుమార్, రీజినల్ జాయింట్ డైరెక్టర్ వి. శ్రీనివాసరావు, ఎస్ఈ లక్ష్మణ్‌గౌడ్, మార్కెట్ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గుంతలో పడి వ్యక్తి మృతి

మధిర రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో నడిచి వెళ్తూ రోడ్డు పక్కనే ఉన్న సైడ్‌కాల్వ గుంతలో పడి ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం మధిర మునిసిపాలిటీ పరిధిలోని హనుమాన్ కాలనీ సమీపంలో జరిగింది. వివరాల ప్రకారం.. స్థానిక హనుమాన్ కాలనీకి చెందిన ఉప్పతల జమలయ్య(45) బోనకల్, ఖమ్మం తదితర ప్రాంతాల్లో ఇనుప బీరువాల తయారీ వర్కర్‌గా పనిచేస్తుంటాడు. ఈనెల 10న మధిర పట్టణంలోని వడ్డెర కాలనీలో ఒక ఫంక్షన్‌కు వెళ్లాడు. అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆయన కోసం బంధువులు పలు ప్రాంతాల్లో గాలించారు. గురువారం ఉద యం సైడ్‌కాల్వ గుంతలో పడిన మృతదేహం పైకి తేలడంతో, ఆరోడ్డున వెళ్లేవారు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఫంక్షన్‌కు వెళ్లి తిరి గి వస్తున్న క్రమంలో మద్యం మత్తులో రోడ్డు పక్కనున్న లోతైన నీటి గుం తలో పడి ప్రమాదవశాత్తూ మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. సెల్‌ఫోన్‌తోపాటు డబ్బులు కూడా రోడ్డుమీదనే పడి ఉన్నాయి. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనాస్థలాన్ని మధిరటౌన్ సీఐ రమేష్ సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రైళ్లలో బంగారం చోరీ చేస్తున్న వ్యక్తి అరెస్టు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): రైళ్లలో బంగారం చోరీ చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు జీఆర్పీ సీఐ అంజలి తెలిపారు. రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీసుస్టేషన్ నందు గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో సిబ్బంది జనరల్ తనిఖీలు చేస్తుండగా రెండో ప్లాట్‌ఫారంపై రూరల్ మండలం ముత్తగూడెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ నాగెల్లి వరకుమార్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. దీంతో అతడిని తనిఖీ చేయగా, అతని వద్ద బంగారు నక్లెస్ దొరికింది. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా పలు రైళ్లలో దొంగతనాలు పాల్పడ్డానని, దొంగతనం చేసి బంగారు వస్తువులు ముత్తగూడెంలోని తన ఇంటిలో దాచానని చెప్పడంతో పోలీసులు అక్కడకు వెళ్లి తనిఖీచేశారు. ఈతనిఖీల్లో 8తులాల బంగారం, కొంత వెండి దొరికింది. దీంతో అతనిపై కేసు నమోదు చేసినట్టు సీఐ అంజలి తెలిపారు. పట్టుబడిన బంగారు, వెండి వస్తువుల విలువ సుమారు రూ.7.50లక్షలు ఉంటుందని తెలిపారు. ఈసమావేశంలో ఆర్‌పీఎఫ్ సీఐ సురేష్‌గౌడ్, ఎస్ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

టేకులపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేసిన విషయం ఆలస్యగా వెలుగులోకి వచ్చింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని తడికలపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శి ఓర్సు గోపాలకృష్ణను సస్పెన్షన్ చేస్తూ జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్యదర్శి గోపాలకృష్ణ గత నెలలో నకిలీ మద్యం తయారీ, రవాణా చేస్తూ మహబూబాబాద్ జిల్లా పోలీసులకు పట్టుబడి అరెస్టై జైలుకెళ్లాడు. ఈ నేపథ్యంలో అధికారులు ఇచ్చిన నివేదిక మేరకు ఈ నెల 4న జిల్లా కలెక్టర్ పంచాయతీ కార్యదర్శిని సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్టు గురువారం టేకులపల్లి ఎంపీడీవో మల్లేశ్వరీ తెలిపారు.

అటవీశాఖ సిబ్బంది ఆటవిడుపుపై విచారణ

» సంచలనం రేపిన ఘటన


లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఆ శాఖ సిబ్బంది పేకాట ఆడటంపై జిల్లా అటవీ శాఖాధికారి (డీఎఫ్‌వో) గురువారం విచారణ చేపట్టారు. సిబ్బంది పేకాట ఆడుతున్న వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవడం, అలాగే దినపత్రికల్లో ప్రచురితమవడం సంచలనం రేపింది. ఈ క్రమంలో అప్రమత్తమైన అటవీశాఖ ఉన్నతాధికారులు సంఘటనపై ఆరా తీస్తున్నారు. దీనిపై డీఎఫ్‌వోను వివరణ కోరగా ఆటవిడుపుగా సిబ్బంది పేకాట ఆడినట్టు తెలిసిందని, అందులో ఒకరు మినహా అందరూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నట్లు పేర్కొన్నారు. అటవీశాఖ ఉద్యోగి డ్రైవర్ అని తెలిసిందన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుపుతున్నామని, నిజమని తేలితే శాఖపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

మరో పది రోజుల్లో..

» కనుమరుగుకానున్న వెంకటేష్ ఖని గ్రామపంచాయతీ
» ఈ నెల 21లోపు ఖాళీ చేయాలని స్థానికులకు నోటీసులు
» ఓపెన్‌కాస్ట్ రాకతో ముగియనున్న 30ఏళ్ల పంచాయతీ ప్రస్థానం
» గంగాబిషన్ బస్తీలోని 'నిర్వాసిత' స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవడంపై ఆవేదన
» ఆర్థికంగా సహకరించాలంటూ కలెక్టర్, సింగరేణి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు



చుంచుపల్లి, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అది సుమారు 30ఏళ్ల క్రితం కొత్తగూడెం సింగరేణి ప్రభావిత ప్రాంతంలో చిన్న గ్రామ పంచాయతీగా ఏర్పడిన గ్రామం. వెంకటేష్ ఖని గ్రామ పంచాయతీగా పేరొందిన ఆ పంచాయతీ మరో పదిరోజుల్లో కనుమరుగు కానుందా? అనే ప్రశ్నకు అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. చుంచుపల్లి మండలంలో మొత్తం 18 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో వెంకటేష్ ఖని ఒకటి. కానీ ఈ పంచాయతీ ప్రస్తుతం కొత్తగూడెం సింగరేణి ఏరియా పరిధిలోని పీవీకే 5 ఓసీ విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసున్న వీకేఓసీ కోల్ మైన్ (ఓపెన్ కాస్ట్) కారణంగా పూర్తిగా ఖాళీ కాబోతోంది. 2022లోనే వెంకటేష్ ఖని పంచాయతీలో నివసిస్తున్న వారిని ఖాళీ చేయించాలని నిర్ణయించారు. దాం తో ఈ పంచాయతీలో నివసిస్తున్న 79కుటుంబాలకు కొత్తగూడెం మునిసిపాలిటీ పరిధిలోని 5వ వార్డు గంగాబిషన్ బస్తీలో ఇంటి స్థలాలు కేటాయించి బీపీఎ ల్ కోటాలో ఇళ్ల పట్టాలను నాటి కొత్తగూడెం ఎమ్మెల్యే హయాంలో పంపిణీ చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతం లో ఉంటే నిర్వాసితులుగా ఇంటి స్థలం పొందవచ్చని కొందరు ఆశావాహులు మండలంలోని వివిధ పంచాయతీల నుంచి వెంకటేష్ ఖని పంచాయతీకి తమ ఓటును ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. వాస్తవానికి వెంకటే ష్ ఖనికి చెందిన వారి ఓటర్లు 164 మంది ఉండగా.. ప్రస్తుతం అధికారులు ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో 20ఓట్లు పెరిగి, మొత్తం 184 ఓట్లు ఉన్నాయి. ఈ క్రమంలో ఓపెన్ కాస్ట్ పనులు వేగంగా జరు గుతుండటంతో ఈ నెల21వ తేదీ లోపు వెంకటేష్ ఖని ప్రాంతాన్ని ఖాళీ చేయాలని 79 కుటుంబాల వారికి సింగరేణి అధికారులు నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. అయితే తమకు ఎలాంటి నోటీసులు రాలేదని స్థానికులు అధికారులను నిలదీస్తే నిర్వాసితులుగా ఇం టి స్థలాల పంపిణీ సమయంలో అందజేసిన పట్టాలే నోటీసులుగా భావించాలని అంటున్నారని వాదన వినిస్తోంది.



ఇటీవల అధికారులు కూల్చేసిన నిరుపేదల ఇళ్లు

ఆ స్థలాల్లో ఇళ్లు ఎలా కట్టుకోవాలి?

సింగరేణి ప్రభావిత ప్రాంతంలో నివసిస్తూ రూజూ కూలీ పనులకు వెళ్తేనే రోజు గడవని తాము నిర్వాసిత కోటాలో ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు ఎలా నిర్మించుకోవాలో అర్థం కావడం లేదని వెంకటేష్ ఖని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఊరిని ఖాళీ చేస్తున్న తమకు ఆ జాగాల్లో ఇళ్లు కట్టుకునేందుకు ఆర్థికంగా సహకరించాలని కలెక్టర్, సింగరేణి సంస్థ, సంబంధిత అధికారుల చుట్టూ ప్రదిక్షణలు చేసినా ఫలితం లేకుండా పోయిందని చెబుతున్నారు. ఈ క్రమంలో ఇటీవలే యంత్రాలతో పంచాయతీలోని నాలుగు ఇళ్లను నేల మట్టం చేయడంతో స్థానికుల్లో ఆందోళన మరింత పెరిగింది. త్వరగా ఖాళీ చేయకపోతే తమ ఇళ్లను కూల్చివేస్తే సామగ్రి ఎందుకూ పనికి రాకుండా పోతుందని వారు దిగాలు చెందుతున్నారు.

అధికారికంగా ఈ పంచాయతీ ఉన్నట్టా? లేనట్లా?

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పంచాయతీ ఓటర్ల జాబితాలో 1,028అభ్యంతరాలతో తుది ఓటర్ల జాబితాను ఇటీవలే డీపీవో అధికారికంగా ప్రకటించారు. వీటిలో చుంచుపల్లి మండలంలో నుంచి 31 అభ్యంతరాలు స్వీకరించారు. అందులో నాలుగు అభ్యంతరాలు వెంకటేష్ ఖని పంచాయతీ నుంచి వచ్చినట్లు ఉండగా, వాటిలో పోలింగ్ కేంద్రం మార్పులు జరిగినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 184 ఓట్లు ఉన్న వెంకటేష్ ఖని గ్రామ పంచాయతీకి సర్పంచ్ ఎన్నికలు, జిల్లా, మండల ప్రాదేశిక ఎన్నికలు రాబోయే రోజుల్లో నిర్వహిస్తారా? లేదా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల ప్రకటించిన ఓటర్ల తుది జాబితాతో పాటు డీపీవో, జడ్పీ, చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయాల్లో వెంకటేష్‌ఖని పంచాయతీ ఓటర్ల వివరాలు ఉండడం గమనార్హం. 21 తర్వాత గ్రామాన్ని ఖాళీ చేస్తే వీరికి ఈ గ్రామంలో ఎన్నికలు ఉంటాయా? లేదంటే వీరికి స్థలాలు కేటాయించిన గంగాబిషన్ బస్తీలో ఓట్లను చేర్చుతారా అనే సందేహాలున్నాయి. ఇక అధికారికంగా ఆన్‌లైన్‌లో వెంకటేష్ ఖని పంచాయతీ ఉంటుందా? లేదంటే ఆ పేరును తొలగిస్తారా? అన్న చర్చ జరుగుతోంది. ఇప్పటికే వీటిపై మండల పరిషత్, జిల్లా పంచాయతీ అధికారులు కలెక్టర్‌కు నివేదిక కూడా అందించారని తెలుస్తోంది.

పరిస్థితులను బట్టి ఎన్నికలుంటాయి

● చంద్రమౌళి, డీపీవో

గ్రామ పంచాయతీ, ప్రాదేశిక ఎన్నికల నోటిఫికేషన్ వస్తే అప్పటి పరిస్థితులను బట్టి అన్ని పంచాయతీలతో పాటు వెంకటేష్ ఖని పంచాయతీకి ఎన్నికలు నిర్వహణపై చర్యలు ఉంటాయి. ఒక వేళ ఆలస్యమైతే రాష్ట్ర ఎన్నికల సంఘానికి, ప్రభుత్వానికి వెంకటేష్‌ఖని పంచాయతీ వాసులను మున్సిపాలిటీ ప్రాంతానికి వారి ఓట్ల తరలింపుపై ప్రతిపాదనలు పంపుతాం. అప్పుడు వారిచ్చే అధికారిక గెజిట్, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం.

ఏఈవోల దురుసు

» పోలీసుల సమక్షంలోనే కేసులు పెడతామంటూ బెదిరింపు చర్యలు
» ఆందోళనలో జాస్తిపల్లి రైతులు



ఆందోళన చేస్తున్న రైతులు

కామేపల్లి, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): రైతులు యూరి యా కోసం కూపన్లు అడిగితే ఇష్టం వచ్చినట్లు దురుసుగా మాట్లాడుతూ ఇద్దరు ఏఈవోలు విరుచుకుపడుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జాస్తిపల్లి రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గత వారం క్రితం రైతులు మద్దులపల్లి ఏఈవో దగ్గరకు యురియా బస్తాల కూపన్లకు దరఖాస్తు చేసుకోగా అప్పటికే యురియా బస్తాలు అయిపోయాయాని, మరో వారంలో లోడు వస్తుందని ఏఈవో చెప్పి వారి వద్ద నుంచి పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని, లోడు రాగానే మీకే కూపన్లు జారీ చేస్తానని చెప్పడంతో ఆరోజు రైతులు తిరిగి వెళ్లారు. అయితే గురువారం రైతువేదికలో యురియా బస్తాల కూపన్లు ఇస్తున్నారని తెలియడంతో జాస్తిపల్లి రైతులు అక్కడికి చేరుకొని మాకు కూపన్లు ఇస్తానని చెప్పారుగా అని అడగగా, కామేపల్లి ఏ ఈవో శ్రీకన్య కలుగ చేసుకొని.. ఇది నా ఆఫీస్ ఎక్కువ మాట్లాడితే కేసు పెడతానని పోలీసుల సమక్షంలోనే బెదిరిస్తుందని రైతులు వాపోయారు.

ఇది విషయంపై ఏఎస్ఐ వెంకటరత్నం సర్దిచెప్పె ప్రయత్నంలో ఆయనపై మీరు ఆగండి సార్ అంటూ ఆయననే బెదిరించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది.. ఈ సందర్భంగా రైతువేదిక ఎదుట రైతులు ఆందోళన చేసి, ఏఈవోలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదరు ఏఈవో ఇటివల అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఎదుటనే కాలు మీద కాలు వేసుకొని కుర్చున్న సంఘటన చర్చనీయాశంమైంది. ఈ ఏఈవోల పనితీరు వలన అధికారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అక్రమ మట్టి రవాణా ట్రాక్టర్ల అడ్డగింత

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గ్రామస్థులు నిలిపివేసిన ఘటన మండలంలో గురువారం జరిగింది. మండలంలోని జమ్మిగూడెంలో గ్రామశివారులో గల చెరువు శిఖం భూముల్లో మూడు రోజులుగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ మట్టిని అశ్వారావుపేటకు తరలిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నారనే సమాచారం తెలుసుకున్న కొంతమంది గ్రామస్థులు ట్రాక్టర్లను గ్రామంలో రహదారిపై నిలిపివేసి పోలీసులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. గ్రామస్థుల ఫిర్యాదుతో పోలీసులు, ఆర్ఐ పద్మావతి ఘటనా స్థలానికి వివరాలు సేకరించారు. మట్టి రవాణాకు ఎటువంటి అనుమతులు లేవని గ్రహించిన అధికారులు నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని రెవెన్యూ కార్యాలయానికి తరలించారు. ఇదే సమయంలో మట్టిని రవాణా చేస్తున్న వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌ని, మరో మూడు ట్రాక్టర్లను అక్కడ నుంచి తప్పించారు. తప్పించిన ట్రాక్టర్ల వివరాలను కూడా గ్రామస్థులు అధికారులకు అందించారు. ఈసందర్భంగా గ్రామపెద్దలు మాట్లాడుతూ మాగ్రామంలోని మట్టిని మేమే వినియోగించుకునేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మట్టి రవాణాను నిలిపివేసిన వారిలో గ్రామస్థులు మిద్దిన కొండయ్య, మిద్దిన రాములు, సింగలూరి కృష్ణ, సింగయ్య, లక్కదాసు శ్రీను, లక్ష్మీ తదితరులున్నారు.



ట్రాక్టర్లను నిలిపివేసిన గ్రామస్థులు

అందుబాటులో యూరియా

తిరుమలాయపాలెం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులకు ఎలాంటి ఇబ్బందిలేకుండా యూరియా సరఫరా చేస్తున్నట్లు ఏఈవో సీతారాంరెడ్డి తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో ఇప్పటి వరకు 150టన్నులు యూరియా సరఫరా చేశామన్నారు. గతంలో మూడు కేంద్రాల ద్వారా రైతులకు యూరియా సరఫరా చేస్తున్నామని, వారు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం మరో 14కేంద్రాలను యూరియా సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎరువుల దుకాణాల్లో యూరియా అధిక ధరలకు అమ్మేవారిపై నిఘాపెట్టి చర్యలు తీసుకుంటామన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం

- అంతర్గత పోరులో అధికారులు
- ప్రధాన సమస్యగా ఖాళీస్థలాలు, డ్రెయినేజీల నిర్వహణ
- రాజకీయ అండతో జవాన్ల ఇష్టారాజ్యం
- స్వయంగా రంగంలోకి దిగిన కమిషనర్

ఖమ్మంకార్పొరేషన్,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో అన్నిరంగాల్లో మహానగరాలతో పోటీ పడుతున్న ఖమ్మం నగరం పారిశుధ్య నిర్వాహణలో మాత్రం సవాల్‌ను ఎదుర్కొంటుంది. నగరంలో ఖాళీస్థలాలు దోమల పెంపక కేంద్రాలుగా మారాయి. ఖాళీస్థలాల యజమానులకు నోటీసులు కూడా ఇవ్వలేని దుస్థితిలోకి ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు వెళ్లారు. ఇక ఫాగింగ్ పేరుతో డీజీల్ బిల్లులు పొందుతున్నా.. నగరంలో సరైన విధానంలో ఫాగింగ్‌జరిగిన డివిజన్ ఒక్కటి కూడా లేదు. ప్రధాన రహదారులు దుమ్ము, మట్టితో వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. డ్రెయినేజీల్లో చెత్తను కూడా తీయలేని పరిస్థితిలో కార్మికుల పర్యవేక్షణ వెనుకపడింది. గతంలో కంటే ప్రతీడివిజన్‌లోను ఇటీవలఅదనంగా కార్మికులను కేటాయించినా.. ఆమేరకు పారిశుధ్య పనితీరు మెరుగు పడక పోగా ఇంకా నిర్లక్ష్యం పెరిగింది. దశబ్దకాలంగా రాజకీయ అండతో జవాన్ల ఇష్టారాజ్యంగా మారింది. వారిని ఇతర డివిజన్లకు కదిలించలేని పరిస్థితి నెలకొంది. వరంగల్‌మహానగరం నుంచి కేఎంసీకి వచ్చిన ఇద్దరు అధికారుల మధ్య అంతర్గత పోరు తీవ్రస్థాయిలోకి వెళ్లింది. పారిశుధ్య కార్మికుల నుంచి జవాన్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వరకు పారిశుధ్య పర్యవేక్షకులు వెనకేసుక రావటంతో పైస్థాయిలోని అధికారులు ఎటువంటి చర్యలకు సిపారసులు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవల హైదరాబాద్ నుంచి డిప్యూటీ కమిషనర్‌గా వచ్చిన అధికారి సైతం తనదైన మార్కును చూపలేక పోతున్నారు.

అంతర్గత పోరులో పారిశుధ్య అధికారులు

ఖమ్మం నగర పాలక సంస్థలో అసిస్టెంట్ కమిషనర్ పారిశుధ్య పర్యవేక్షకులు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరు పర్యవేక్షణలో 60డివిజన్లలో పారిశుధ్య పర్యవేక్షణ జరపాల్సి ఉంటుంది. కానీ అసిస్టెంట్ కమిషనర్‌కు పారిశుధ్య పర్యవేక్షకుడికి మధ్య ఇటీవల వరసగా అంతర్గత పోరు మొదలైంది. పారిశుధ్య కార్మికులను గాడిలో పెట్టేందుకు అసిస్టెంట్ కమిషనర్ ఏదైనా హెచ్చరికలు చేస్తే కార్మికులకు సపోర్టుగా పారిశుధ్య పర్యవేక్షకులు నిలబడుతున్నారు. జవాన్లు, శానిటరి ఇన్‌స్పెక్టర్లను ఒక్కమాట అనోద్దు అంటూ అడ్డుపడుతున్నారు. ఇప్పుడు ఈ పంచాయతీ అధికారుల మధ్య విభేదాల నుంచి కార్పొరేటర్ల వరకు వెళ్లింది. ఒకఅడుగు ముందుకేసిన పారిశుధ్య కార్మికులు ఇప్పుడు కార్పొరేటర్ల ద్వారా అసిస్టెంట్ కమిషనర్‌పై ఫిర్యాదులు చేసే వరకు వెళ్లారు.

స్వయంగా రంగంలోకి దిగిన కమిషనర్

పారిశుధ్యాన్ని గాడిలో పెట్టేందుకు అనేక ప్రయత్నాలు చేసిన కమిషనర్ అభిషేక్ అగస్త్య చివరకు తానే స్వయంగా రంగంలోకి దిగారు. రెండు రోజులుగా ఖమ్మం నగరంలో తనిఖీలు ప్రారంభించారు.ఉదయం 5.30గంటలకే రోజుకే మూడు డివిజన్ల చొప్పున నేరుగా తనిఖీలు చేస్తున్నారు. ప్రధాన రహదారుల స్వీపింగ్ చేసే వాహనాల పని నాణ్యతను పరిశీలించి పలు ఆదేశాలిచ్చారు. కార్మికుల హాజరు రికార్డులను తనిఖీలు చేస్తున్నారు. హాజరు నమోదు తర్వాత కార్మికులు ఏమీ చేస్తున్నారని రోజుకు ఎంత పనిచేస్తున్నారే ఆరా తీస్తున్నారు. డివిజన్లు వారీగా అధికారులకు బాధ్యతలను కేటాయిస్తున్నారు. అయితే పారిశుధ్య విభాగంలో తలనొప్పిగా మారి, పని తీరు మార్చుకోలేని పదవీ విరమణకు సమీపంలో ఉన్న ఓఅధికారిపై త్వరలో చర్యలు తీసుకోనున్నారు.



పారిశుధ్యంపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్న కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య



అబ్దుల్ కలామ్‌నగర్‌లో డ్రెయినేజీలో అపరిశుభ్రత



డివిజన్లలో ఆకస్మిక పర్యటన చేస్తున్న కమిషనర్

17న కబడ్డీ ఎంపికలు

ఖమ్మంస్పోర్ట్స్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 17న నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో సబ్‌జూనియర్ బాలురు, బాలికల కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి క్రిష్టఫర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపికచేసి త్వరలో నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు.ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 30-11-2009తరువాత జన్మించిన వారు, బరువు 55 కేజీల లోపు ఉండాలని అన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు తమ ఆధార్, జనన ధ్రువీకరణ పత్రంతో ఉదయం 10గంటల కల్లా స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని అన్ని డిపోలలోని ఆర్టీసీ కార్మిక సంఘాలజాయింట్ యాక్షన్ కమిటీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. భద్రాచలం డిపో కార్మికులసమస్యలను వెంటనే పరిష్కరించాలని, తగ్గించిన మస్టర్లను పునరుద్ధించాలని, కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహించారు.ఖమ్మం, కొత్తగుడెం, మధిర, సత్తుపల్లి,భద్రాచలం, మణుగురు, ఇల్లెందు డిపోల పరిధిలో ఉద్యోగులు కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ భద్రాచలం డిపో కార్మికులకు సంఘీభావం తెలుపుతూ నిరసనలు తెలిపారు.

‘శ్రీకోటమైసమ్మ’ షాపుల వేలం పూర్తి



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కామేపల్లి,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్త లింగాలలోని శ్రీకోటమైసమ్మ దేవస్థాన షాపుల బహిరంగ వేలం పాట గురువారం నిర్వహించారు. కార్యనిర్వహణ అధికారి ఉమ, పర్యవేక్షణాధికారి నల్లమోతు శేషయ్య సమక్షంలో వేలం నిర్వహించారు. కొబ్బరికాయాలు, పూజాసామగ్రిని రూ.లక్షా40వేలకు కొత్తలింగాలకు చెందిన కొత్తగట్టు ఉమ, కొబ్బరిచిప్పలు పోగు చేసుకునే హక్కును తాళ్లగూడేనికి చెందిన బండారి రమేష్ రూ.12వేలకు, తలనీలాలును సజ్జ శ్రీను రూ4500కు దక్కించుకున్నారు. అనంతరం ఆలయ హుండీని లెక్కించగా, రూ.19159 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి పుల్లయ్య శర్మ, జూనియర్‌అసిస్టెంట్ వరప్రసాద్ తోటకూరి శ్రీనివాసరావు, సత్యమయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు, నాగేశ్వరీ, కళావతి, రేణుక పాల్గొన్నారు.

సీపీగెట్ ర్యాంకర్లకు సన్మానం

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పీజీ ప్రవేశాల కోసం నిర్వహించిన సీపీగెట్ పరీక్షల్లో నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ డిగ్రీకళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకలు సాధించారని ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ర్యాంకర్లను సన్మానించారు. ప్రభుత్వ పాలనశాస్త్ర విభాగంలో కె.నరేష్ రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు, చరిత్రవిభాగంలో ఐ.రాజేష్ 41వ ర్యాంకు సాధించారని తెలిపారు.

క్షయవ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వసుంధర

తిరుమలాయపాలెం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిపై విద్యార్థులు అప్రమత్తగా ఉండాలని సుబ్లేడు పీహెచ్‌సీ వైద్యురాలు వసుంధర కోరారు. గురువారం మండలంలోని మాదిరిపురంలో ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో విద్యార్థులకు ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధిపై అవగాహన నిర్వహించారు. అనుమానితులుంటే వైద్యపరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోవైస్ ప్రిన్సిపాల్ జోసఫ్, ప్రోగ్రాం నిర్వహకులు ఉపేందర్, రామకృష్ణ, ఏఎన్ఎం ఇందిరరేఖ పాల్గొన్నారు.

సునందకు కీర్తి పురస్కారం

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయురాలు, రచయిత్రి పురిమళ్ల సునందకు 2024 సంవత్సరానికిగాను తెలుగు యునివర్సిటీ కీర్తి పురస్కారాన్ని ప్రకటించింది. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేస్తున్న వారిని ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తోంది. ఈనెల 23,24 తేదీల్లో జరిగే ఉత్సవాల్లో ఈపురస్కారాన్ని అందించనున్నారు.

రుద్రాక్ష ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌లో రుద్రాక్షలను పరిశీలిస్తున్న దృశ్యం

ఖమ్మంచర్చికాంపౌండ్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): బైపాస్‌రోడ్డులోగల ఆర్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన రుద్రాక్ష ఎగ్జిబిషన్‌ను గురువారం కాంగ్రెస్ నాయకుడు, మాజీఏఎంసీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్ ప్రారంభించారు. ఈప్రదర్శనలో ఏకముఖినుంచి 21ముఖముల రుద్రాక్షల వరకు అందుబాటులో ఉంటాయని నిర్వాహకుడు ఓంశ్రీనేపాల్ రుద్రాక్ష ఆర్గనైజేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.దుర్గాప్రసాద్ తెలిపారు. ఈప్రదర్శనలో కరుంగళి, స్ఫటిక, నవరత్న మాలలు, సాలిగ్రాంలు, దక్షణావృత శంకులు లభిస్తాయని తెలిపారు. ఈప్రదర్శన ఈనెల18వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

తిరుమలాయపాలెం, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదుళ్లచెరువులో ఓఇంటిలో పేకాటఆడుతున్న వారిపై టాస్కుఫోర్సు తిరుమలాయపాలెం పోలీసులు గురువారం దాడిచేసి పట్టుకున్నారు. ఖమ్మంతోపాటు మరిపెడబంగ్లా, వివిధ గ్రామాలకు చెందిన సుమారు 8మంది ఎస్ఐ కూసుపుడి జగదీష్ ఆధ్వర్యంలో తనిఖీ అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30,350, కారు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశారు.

వంతెన మరమ్మతులు చేపట్టాలి



నేలకొండపల్లి, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అనాసాగరం ముదిగొండ మండల పరిధిలోని ముదిగొండలానికి చెందిన పమ్మి గ్రామాల మధ్య ఉన్న మంగాపురం మేజర్ కాల్వ బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని, మరమ్మతులు చేపట్టాలని సీపీఎం నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఈ వంతెనను సీపీఎం బృందం పరిశీలించింది. సాధ్యమైనంత త్వరగా బ్రిడ్జిని బాగు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎడ్ల తిరుపతిరావు, బొడ్డు మధు, నున్నా మధుసూధనరావు, గడిపూడి వెంకటేశ్వర్లు, షేక్.నాగుల్‌మీరా, రాయవరపు బుచ్చయ్య, చావా శ్రీనివాసరావు, ఏసు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అంధ పాఠశాల ఏర్పాటు?

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని అంధ విద్యార్థులకు ప్రత్యేకంగా ఓ పాఠశాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. జిల్లాలోని అంధ విద్యార్థులు ఎంత మంది ఉన్నారు, వారికి కావాల్సిన తరగతి గదులు, సామగ్రి తదితర అంశాలపై పరిశీలించి వెంటనే సమగ్ర సమాచారం అందించాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో వారు సమాచారం సేకరిస్తున్నట్లు తెలిసింది. ఖమ్మం నగరంలో ఓ రెండు గదులలో ఈ పాఠశాల ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

ఖమ్మంరూరల్, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముత్తగూడెం గ్రామానికి చెందిన ఓ యువతి కనిపించడం లేదని పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదు అయింది. గ్రామానికి చెందిన అంగిరేకుల నాగేశ్వరరావుకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. రెండో కుమార్తె రుక్మిణి డిగ్రీ పూర్తి చేసింది. రెండేళ్లుగా ఇంట్లోనే ఉంటుంది. తల్లి,దండ్రులు రోజులాగే గురువారం పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూడగా కూతురు రుక్మిణి కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తండ్రి నాగేశ్వరరావు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు వేతనాలు అందించాలి

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి):ఖమ్మం జిల్లాలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఆగస్టునెల వేతనాలు నేటికీ అందించలేదని, వారి వేతనాలను వెంటనే అందించాలని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు కట్టా. శేఖర్‌రావు కోరారు. జిల్లాలో మొత్తం కేజీబీవి, సీఆర్‌పీలు తదితరులు సుమారు 5వందల మంకి పైగా సమగ్ర శిక్షలో విధులు నిర్వహిస్తున్నారని, విద్యాశాఖ కార్యాలయంలో వీరి వేతనాలు మంజూరు చేసే అధికారి సెలవులో ఉండటంతో వేతనాలు మంజూరు చేయలేదన్నారు. వేతనాలు వెంటనే అందించాలని కోరుతూ పీఆర్‌టీయు నేతలు సంభందిత విద్యాశాఖ అధికారులను కోరారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో, నాణ్యతగా పూర్తి చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. పనులు జాప్యం అయితే నిర్మాణ ఖర్చులు పెరిగిపోయి ప్రభుత్వంపై భారం పడుతుందన్నారు. క్షేత్రస్థాయిలో చిన్నచిన్న సమస్యలను ఆయా శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. జిల్లాకు మంజూరైన 41 అంగన్‌వాడీ కేంద్రాల్లో40, గ్రామపంచాయతీ భవనాలు 101లో 70 వరకు నిర్మాణంలో ఉన్నాయన్నారు. 30జీపీ భవనాలు 1అంగన్వాడీ కేంద్రం నిర్మాణం పూర్తయ్యిందన్నారు. పెండింగ్ పనులను డిసెంబరు చివరి నాటికి జీపీభవనాలు అంగన్వాడీ కేంద్రాల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. 11కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సుల్లో 5పూర్తి చేశామని ఇంకానాలుగు పనులు ప్రారంభం కాలేదని దీనికి కారణాలను ప్రశ్నించారు. సబ్‌సెంటర్లు, ఎంఐడీసీ కింద ఖమ్మం ఆస్పత్రిలో టాయిలెట్స్ నిర్మాణం పనులను పూర్తి చేయాలన్నారు. టేకులపల్లి డైట్ కళాశాల పనులు 70శాతం పూర్తయ్యాయని వీటికి అవసరమైన సవరణ అంచనాలు ఆమోదించి 2026 నాటికి పూర్తి చేయాలన్నారు. నీటిపారుదల శాఖలో చెక్‌డ్యాం పనులను ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో సీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో సన్యాసయ్య, డీడబ్ల్యూవో రాంగోపాల్ రెడ్డి, ఎస్ఈలు యాకోబు,వెంకటరెడ్డి, పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, నీటిపారుదలశాఖ, మునిసిపల్, మిషన్‌భగీరథ, ట్రైబల్‌వెల్‌ఫేర్, ఐఎస్‌డీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన సీపీ

ఖమ్మంక్రైం,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను గురువారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తనిఖీచేశారు. ట్రాఫిక్ నిర్వాహణలో సవాళ్లను చర్చించారు. ముఖ్యంగా నగరంలో ట్రాఫిక్ నిర్వాహణను మెరుగుపరచడానికి, ప్రజలకు మెరుగైన సేవలందిండానికి కృషిచేయాలని, రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిబ్బందిని అదనంగా నియమించాలని అధికారులకు సూచించారు.ప్రజల మధ్య ఉండి విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు ప్రజలతో వివాదాలకు పోకుండా మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. సిబ్బంది బాడీబామ్ కెమేరాలు ఉపయోగించాలని సూచించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో వ్యక్తిగత సంస్థలు మునిసిపల్ అధికారుల సమన్వయంతో సరైన పార్కింగ్ స్థలాలు గుర్తించాలని అధికారులకు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఆదేశించారు. ఈ సందర్భంలో ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు, సీఐ బెల్లంసత్యనారాయణ, ఎస్ఐ సాగర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

ట్రాక్టరుకు రూ.2వేలు!

(5వ పేజీ తరువాయి)

తరలిస్తున్నాయి. మున్నేటి నడిబొడ్డున ప్రైవేటు వ్యక్తులు గేటు ఏర్పాటు చేసి ఒక్కో ట్రాక్టరుకు రూ.వేయి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భారంగా..

ప్రభుత్వం పేదలకు సొంతింటి కళను నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో ఇందిరమ్మఇళ్లను మంజూరు చేసింది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొనుగోలు భారం కాకూడదని తహసీల్దార్ అనుమతితో ఇసుక కూపన్లను మంజూరు చేస్తుంది. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ నుంచి సదరు ప్రైవేటు వ్యక్తి, అతడి సైన్యం బలవంతపు వసూళ్లకు పాల్పడుతోంది. ఒక్కో ట్రాక్టరుకు రూ.2 వేలు వసూలు చేస్తుండటంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే అంతా..

మున్నేటిలో జరుగుతున్న అక్రమ వసూళ్లకు సంబంధించిన లావాదేవీలు, నిత్యం ఎన్ని ట్రాక్టర్లు ఇసుకను రవాణా చేస్తున్నాయని తమ ప్రైవేటు సైన్యం ఎంత వసూళ్లు చేస్తున్నాయని పర్యవేక్షించేందుకు అక్రమ వసూళ్ల సూత్రధారి మున్నేటిలో సీసీకెమెరాలను కూడా ఏర్పాటు చేశాడు. పది మంది ప్రైవేటు సైన్యం రాత్రింబవళ్లు కాపలా కాస్తూ ట్రాక్టర్ల వారి నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతి ఉండి కూపన్లు ఉన్నా ఇసుక ట్రాక్టర్ల నుంచి ఇష్టారీతిన అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వారిపై అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడంలేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆట బొమ్మల వితరణ

నేలకొండపల్లి, సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): భక్తరామదాసు సర్వీస్ సొసైటీ సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని బైరవునిపల్లి అంగన్‌వాడీ విద్యార్థులకు సుమారు రూ.5వేల విలువైన ఆటబొమ్మలను అందించారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు ఆడుకోవటానికి వీటిని అందచేసినట్లు సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరి వెంకటరామారావు చెప్పారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గెల్లా వెంకటరమణ గుప్తా, మాజీ అధ్యక్షులు యలమద్ది లెనిన్, పొన్నగాని శ్రీను, వెల్లంపల్లి శ్రీనివాస్, గెల్లా జగన్మోహన్‌రావు, ఉపాధ్యక్షుడు తెల్లగొర్ల లింగస్వామి, సభ్యులు పచ్చా తిరుపతయ్య, రాయల రమేష్, వెంకటాచారి, యర్రా సైదయ్య, మండడి వెంకటేశ్వరరావు, చిట్ల భాస్కరరెడి, మల్లెబోయిన శ్రీనివాసరావు, గోళ్ళ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆటవస్తువులు అందజేస్తున్న సభ్యులు

భార్యపై దాడి: భర్త అరెస్ట్

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): భార్యపై దాడిచేసిన భర్తను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. ప్రకాశ్‌నగర్‌కు చెందిన షేక్ యాకూబ్‌పాషా నగరంలో ద్విచక్రవాహన మెకానిక్‌గా పని చేస్తున్నాడు.అదే ప్రాంతంలో నివసించే నవ్య అనే యువతిని ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలం తరువాత భార్యను యాకూబ్‌పాషా వేధిస్తుండటంతో ఆమె పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసింది. అయినా అతడిలో మార్పు రాకపోవటంతో ఇటీవల విడాకుల నోటీస్ పంపింది. ఈ క్రమంలో గురువారం పుట్టింట్లో ఉన్న నవ్యపై దాడి చేశాడు. తీవ్రంగా కొట్టాడు. ఈ ఘటనపై నవ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ సీఐ-2గా అప్పలనాయుడు

ఖమ్మంక్రైం,సెప్టెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ట్రాఫిక్ సీఐ 2గా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా అప్పలనాయుడును నియమిస్తూ పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం ఇక్కడ సీఐ-2గా విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ సాంబశివరావు తిరిగి హెడ్ క్వార్టర్స్‌కు కేటాయించారు. ఈ మేరకు అప్పలనాయుడు గురువారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఎన్నిక

వైరా,సెప్టెంబరు11(ఆంధ్రజ్యోతి): విశ్రాంతి ఉద్యోగుల సంఘం వైరా మండలశాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం వైరాలో జరిగిన ఆసంఘం సదస్సులో అధ్యక్ష, కార్యదర్శులుగా చల్లా కృష్ణారావు, మాచర్ల జయశంకర్, కోశాధికారిగా సామినేని వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా షేక్.వలీజాన్, ఉపాధ్యక్షుడిగా ఎన్.పెంటయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె.సరస్వతీ, మరికొందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శిథిలావస్థలో కల్వర్టులు

» భారీ వాహనాల రద్దీతో కూలుతున్న వంతెనలు
» హైలెవల్ వంతెనలు నిర్మించాలని ప్రజల వినతి

చింతకాని, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో వంతెనలు, కల్వర్టులు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. అధికారులు వీటిని పట్టించుకోకపోవడంతో ముప్పుగా మారి ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి. వీటిపై ప్రయాణించాలంటే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఏటా వర్షాకాలంలో వచ్చే కొద్దిపాటి వర్షాలకే కల్వర్టులు, లో లెవల్ బ్రిడ్జిలపై నుంచి వరద ప్రవహిస్తుంది. కుండపోతగా వర్షాలు వచ్చిన సమయంలో రెండు, మూడు రోజుల వరకు ప్రయాణాలు నిలిపివేయాల్సిన పరిస్థితి. నిర్వహణ లోపానికి తోడు, రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఈ కల్వర్టులపై రాకపోకలు సాగించాల్సి వస్తొందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఖమ్మం- బోనకల్ రోడ్డు ఊరచెరువు బంధంపై వరదనీరు



నాగులవంచ-పాతర్లపాడు చప్టాపై వరదనీరు

రాకపోకలు ఆపేయాలి..

మండల పరిధిలోని నాగులవంచ- పాతర్లపాడు గ్రామాల మధ్య ఉన్న బండిరేవు, నేరడ- చింతకాని గ్రామాల మధ్య ఉన్న దాసరి బంధం, రేపల్లెవాడ- చింతకాని మధ్య ఉన్న జెర్రిపోతుల బంధం, నేరడ- లచ్చగూడెం గ్రామాల మధ్య ఉన్న కొత్తబంధం, లచ్చగూడెం- రామకృష్ణాపురం గ్రామాల మధ్య ఊర చెరువు బంధం, నాగిలిగొండ- రెడ్డిగూడెం గ్రామాల మధ్య మునగాల వాగు, బోనకల్- ఖమ్మం మెయిన్‌రోడ్డుపై రామకృష్ణాపురం అడ్డరోడ్డు సమీపంలోని వాగు ఇలా మండల వ్యాప్తంగా ఉన్న 7 వాగులపై ఏళ్ల క్రితం నిర్మించిన లో లెవల్ బ్రిడ్జిలు, కల్వర్టులపై కొద్దిపాటి వర్షాలకే వరద ప్రవహించడంతో వాహన రాకపోకలు నిలిపివేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ పరిస్థితి ఏళ్లుగా కొనసాగుతోంది. రెండేళ్ల క్రితం నాగులవంచ- పాతర్లపాడు గ్రామాల మధ్య ఉన్న బండిరేవుపై వరద ప్రవహిస్తుండగా ఓ కారు అందులో కొట్టుకుపోయింది. గ్రామస్థులు సకాలంలో స్పందించడంతో కారులో ఉన్న వారిని సురక్షితంగా బయటకు తీశారు.

భారీ వాహనాల రద్దీతో శిథిలావస్థకు..

అప్పటి ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించిన వీటిపై సామర్థ్యానికి మించిన బరువు ఉన్న వాహనాలు వెళుతుండగా కాలక్రమంగా మరమ్మతులకు గురవుతున్నాయి. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించిన ఈ కల్వర్టులు శిథిలావస్థకు చేరి అకస్మాత్తుగా కూలిపోతున్నాయి. అధికారులు సమస్యలు ఉన్న దగ్గర తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలం వెల్లదీస్తున్నారు. ఇటీవల కాలంలో నేరడ- చింతకాని రహదారిపై నేరడ గ్రామ సమీపంలోని వాగుపై ఉన్న వంతెన అకస్మాత్తుగా కూలిపోయింది. ఆ సమయంలో వాహనాలు ఏమి లేకపోవడంతో ప్రమాదం తప్పింది. స్థానిక మండల నాయకులు స్పందించి ఉప ముఖ్యమంత్రి భట్టి దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పాత వంతెనల స్థానంలో హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించాలి

కొండా గోపి (బీజేపీ మండల అధ్యక్షుడు)



వాగులపై లోలెవల్ బ్రిడ్జిల నిర్మించడం వల్ల భారీ వర్షాలు వచ్చినపుడు బ్రిడ్జిలపై నుంచి వరద ప్రవాహం ఉండడంతో అధికారులు రాకపోకలు నిలిపివేస్తున్నారు. ఇటువంటి సమయాల్లో అనారోగ్యంతో బాధపడుతున్న వారు, గర్భిణిలను ఆసుపత్రులకు తరలించాలంటే ఇబ్బందిగా ఉంది. శిథిలావస్థకు చేరిన కల్వర్టులు, బ్రిడ్జిల స్థానంలో హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలి.

డ్రెయినేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలి

» జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత



ఎస్సీకాలనీని పరిశీలించిన డీపీవో

తల్లాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో ఎన్ఎస్‌పీ మేజర్ కాల్వ సమీపంలోని ఎస్సీకాలనీలో శాశ్వత డ్రెయినేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ఆదేశించారు. ఎస్సీకాలనీలో నెలకొన్న డ్రైనేజీ దుస్థితిపై బీజేపీ జిల్లా నాయకుడు అపతి వెంకటరమారావు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం అన్నారుగూడెం ఎస్సీకాలనీని డీపీవో పరిశీలించారు. ఈసందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. ఎన్ఎస్‌పీ మేజర్ కాల్వకు ఇరువైపులా సరిహద్దులు గుర్తించాలని, సిమెంట్ లైనింగ్ కోసం అంచనాలు రూపొందించాలని సూచించారు. తక్షణమే కాల్వకు ఇరువైపుల మురగునీరు బయటకు వెళ్లేలా కచ్చా డ్రెయిన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురుష్ బాబు, ఎన్ఎస్‌పీ ఏఈ ఆయేషా, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, అపతి వెంకటరామారావు, తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు.

ప్రత్యేక సందర్శనలకు యాత్రలను దానంచేసే సదుపాయం

» సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక సందర్శనలకు యాత్రలను దానంచేసే సదుపాయం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ సత్తుపల్లి డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ టీజీఎస్‌ఆర్టీసీ 'యాత్రాదానం' పేరుతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, నిరుపేదలను తీసుకెళ్లడమే యాత్రాదానం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. వ్యక్తులు, ప్రజా ప్రతినిధులు, కార్పోరేట్ సంస్థల తమ సామాజిక బాధ్యతలో భాగంగా ఈ యాత్రాదానం కార్యక్రమానికి విరాళాలు అందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తమ ప్రత్యేకమైన, సంతోషకరమైన రోజుల్లో కొంత మొత్తాన్ని విరాళం ఇవ్వడం ద్వారా ఇతరులకు ఆనందం కలిగించాలని పిలుపునిచ్చారు. సామాజిక సేవలో భాగంగా వినూత్న ఆలోచనలకు సహకారం అందించాలని, పర్యాటక ప్రాంతాలకు వెళ్లే స్తోమత లేనివారికి ఇదోక వరమన్నారు. వివరాలకు 9959225962, 9866619189నంబర్లను సంప్రదించాలన్నారు.

'చలో కొత్తగూడెం'ను జయప్రదం చేయండి

తల్లాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న జరిగే ఛలో కొత్తగూడెం కార్యమాన్ని జయప్రదం చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ధశరద్‌నాయక్ కోరారు. గురువారం మండలంలోని మల్సూర్‌తండాలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న కొత్తగూడెం జరిగే లంబాడీల ర్యాలీకి జిల్లా నుంచి వెలాది మంది లంబాడీలు తరలిరావాలని కోరరు. తల్లాడ, కల్లూరు అధ్యక్షులు భూక్యా రవినాయక్, బానోతు నందు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగి రావిరాల మృతి

మధిర రూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలోని వినియోగదారుల ఫోరం కేంద్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రావిరాల శ్రీనివాసరావు(57) తన స్వగ్రామమైన మధిర మండలం చిలుకూరు గ్రామంలో గురువారం మృతిచెందారు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. రావిరాల అనేక సంవత్సరాలుగా ఎర్రుపాలెం మండలంలో వీఆర్వోగా పనిచేసిన అనంతరం గత ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేయడంతో ఆయన ప్రస్తుతం వినియోగదారులఫోరం కేంద్రంలో పనిచేస్తున్నారు. ఆయన మృతితో ఆ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కాంగ్రెస్ నాయకుడు నిడమానూరి వంశీ, గతంలో వీఆర్వోలుగా పనిచేసిన పలువురు, ఖమ్మం వినియోగదారుల ఫోరం కేంద్రం సిబ్బంది ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

గుండెపోటుతో సొసైటీ మాజీ చైర్మన్ మృతి

తల్లాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్నవల్లి గ్రామంలో సొసైటీ మాజీచైర్మన్ శీలం రాఘవరెడ్డి(61) గుండెపోటుతో గురువారం తెల్లవారుజామున మృతిచెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1995నుంచి 2005వరకు కుర్నవల్లి సొసైటీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన భౌతికకాయాన్ని వివిధ పార్టీల నాయకుల సందర్శించి నివాళులర్పించారు

రైతులకు యూరియా కష్టాలు

బోనకల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆళ్లపాడు గ్రామ రైతులు తమకు సరిపడా యూరియా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామం రావినూతల సొసైటీ పరిధిలో ఉందని, యూరియా కోసం 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న సొసైటీ వద్దకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. రోజుల తరబడి ప్రదక్షణాలు చేస్తున్నా తమ గ్రామానికి రావాల్సిన కోటా అందడం లేదని, యూరియాను పంటల సాగు ప్రకారం అందించాలని కోరుతున్నారు.

సొసైటీలకు యూరియా సరఫరా

చింతకాని, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌కు గురువారం చేరిన 115.200 మెట్రిక్ టన్నుల గుజరాత్ యూరియాను జిల్లాలోని సహకార సంఘాలకు, 1500 మెట్రిక్‌టన్నులను సహకార సంఘాలతో పాటు ప్రైవేటు డీలర్లుకు సరఫరా చేసినట్లు ర్యాక్ పాయింట్ ఏవో పవన్‌కుమార్ తెలిపారు.

ట్రాక్టరుకు రూ.2వేలు!

(5వ పేజీ తరువాయి)

తరలిస్తున్నాయి. మున్నేటి నడిబొడ్డున ప్రైవేటు వ్యక్తులు గేటు ఏర్పాటు చేసి ఒక్కో ట్రాక్టరుకు రూ.వేయి నుంచి రూ.2వేల వరకు వసూలు చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భారంగా..

ప్రభుత్వం పేదలకు సొంతింటి కళను నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక కొనుగోలు భారం కాకూడదని తహసీల్దార్ అనుమతితో ఇసుక కూపన్లను మంజూరు చేస్తుంది. ఇందిరమ్మ ఇళ్లకు ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ నుంచి సదరు ప్రైవేటు వ్యక్తి, అతడి సైన్యం బలవంతపు వసూళ్లకు పాల్పడుతోంది. ఒక్కో ట్రాక్టరుకు రూ.2 వేలు వసూలు చేస్తుండటంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణలోనే అంతా..

మున్నేటిలో జరుగుతున్న అక్రమ వసూళ్లకు సంబంధించిన లావాదేవీలు, నిత్యం ఎన్ని ట్రాక్టర్లు ఇసుకను రవాణా చేస్తున్నాయని తమ ప్రైవేటు సైన్యం ఎంత వసూళ్లు చేస్తున్నాయని పర్యవేక్షించేందుకు అక్రమ వసూళ్ల సూత్రధారి మున్నేటిలో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశాడు. పది మంది ప్రైవేటు సైన్యం రాత్రింబవళ్లు కాపలా కాస్తూ ట్రాక్టర్ల వారి నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతి ఉండి కూపన్లు ఉన్నా ఇసుక ట్రాక్టర్ల దగ్గర నుంచి ఇష్టారీతిన అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వారిపై అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడంలేదోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మహేష్ కుటుంబానికి అండగా ఉంటాం: సండ్ర

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పిడుగుపాటుకు గురైన బీఆర్ఎస్ కార్యకర్త ధరావత్ మహేష్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం మండలంలోని సత్యనారాయణపురంలో మహేష్ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. తల్లీదండ్రులు భాషా, కాంతం దంపంతులను ఓదార్చి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం నిర్వహించిన మహేష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అదేవిధంగా ఇటీవల మృతిచెందిన పాకలగూడెంలోని గౌర లోహిత, గౌరిగూడెంలోని చిలుకూరి పెద్ద సోమిరెడ్డి, పట్టణానికి చెందిన నాయుడు వెంకటేశ్వరరావు, కొమ్ము ప్రభాకర్, జొన్నలగడ్డ వెంకటమ్మ కుటుంబాలను పరామర్శించి ఓదార్చారు. ఆయన వెంట నాయకులు కూసంపూడి మహేష్, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకరరావు, చాంద్‌పాషా, వాసురెడ్డి, పర్వతనేని వేణు, గుండ్ర రఘు, రవి పాల్గొన్నారు.

వేతన హామీని ప్రభుత్వం అమలు చేయాలి

కల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) పదివేల వేతన హామీని అమలు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండు చేస్తూ కల్లూరులో గురువారం ఏఐటియూసి ఆధ్వర్యంలో వివోఏలు సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐకెపి వివోల సంఘం జిల్లా కన్వీనర్ వేమే నాగమణి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో వివోఏలకు నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండు చేశారు. పెండింగ్ వేతనాలు అందిస్తూ గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని, నేరుగా వివోఏల ఖాతాలో వేతనాలు జమా చేయాలని నాగమణి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కనీస వేతన చట్టంతో పాటుగా, వ్యక్తిగత ప్రమాద భీమా సౌకర్యం రూ.10 లక్షలు కల్పించాలని కోరారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్‌కు వివోఏలు అందించారు. ఏఐటియూసి జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, సిపిఐ మండల కార్యదర్శి దయాకర్‌రావు, వివోఏల రజిత, లలిత, వెంకట్రావమ్మ, కృష్ణవేణి, మరియమ్మ మల్లిక, కోటేశ్వరి పాల్గొన్నారు.

వెంకటరత్నంకు రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి

వైరా, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని గండగలపాడుకు చెందిన చర్లపల్లి జైలు వార్డర్‌గా విధులు నిర్వహిస్తున్న పూర్ణకంటి వెంకటరత్నం పోలీసుశాఖలోని రత్న ఆర్ట్స్ విభాగం పెయింటింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ, జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతులు సాధించారు. ఇటీవల రత్న ఆర్ట్స్ విభాగంలో నిర్వహించిన స్పోర్ట్స్ అండ్ పెయింటింగ్ పోటీల్లో వెంకటరత్నం రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించాడు. అతర్వాత జాతీయస్థాయి పోటీల్లో 28రాష్ట్రాల వారు పోటీపడ్డారు. వారందరిలో తన ప్రావీణ్యాన్ని కనబర్చి ద్వితీయ బహుమతిని దక్కించుకున్నాడు. హైదరాబాద్ పోలీస్ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు చేతులమీదుగా ఈ అవార్డులు అందుకున్నారు. జైళ్లశాఖ డీజీ వెంకటరత్నంను అభినందించారు. తమ గ్రామానికి చెందిన వెంకటరత్నం రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఆయకట్టు భూములకు నీరందించాలని ధర్నా

తల్లాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వైరా ప్రాజెక్టు ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలని కోరుతూ తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో తల్లాడలో సాగునీటి కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ మాట్లాడారు. తల్లాడ మండలంలోని పినపాక రెవెన్యూ పరిధిలోని వైరా ప్రాజెక్టు నాలుగో నెంబరు కాలవలో ఉన్న పూడికను తొలిగించి చివరి భూముల వరకు నీరు అందించి పంటలను కాపాడాలని అన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని లేనట్లయితే రైతులందరిని సమీకరించి సాగునీరు వచ్చేవరకు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర నాయకురాలు మాచర్ల భారతి, సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, రైతుసంఘం నాయకులు కళ్యాణపు కృష్ణయ్య, అయినాల రామలింగేశ్వరరావు, జీవరత్నం పాల్గొన్నారు.

మండలంలో మాజీ ఎమ్మెల్యే పర్యటన

కారేపల్లి సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో వైరా మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులను పరామర్శించారు. ఇటివల మొట్లగూడెంలో ఆత్మహత్యకు పాల్పడిన కాంట్రాక్టర్ గడిపర్తి శ్రీనువాస్‌రావు కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే బాజుమల్లాయిగూడెంలో అనారోగ్యంతో ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న నున్న కాంతయ్యను, పరామర్శించారు. అలాగే కొత్తూరు తండాకు చెందిన మాజీ వార్డుసభ్యురాలు మాలోత్ సఖ్య తల్లి కోమటి సంతాప సభకు హజ్జరై ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్ళులర్పించారు. రాములు నాయక్ వెంట మాజీ ఎంపీపీ శకుంతలచమాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనువాస్‌రావు, సొసైటీ వైస్ చైర్మన్ దారవత్ మంగీలాల్, అజ్మీర వీరన్న, మాజీ సర్పంచ్ మాలోత్ కిషోర్, కాంగ్రెస్ పార్టీ కారేపల్లి పట్టణ కమిటి అధ్యక్షులు పొలాగాని శ్రీనివాస్‌రావు, సీపీఎం మండల కార్యదర్శి కె.నరేందర్‌వాంకుడోత్ నరేష్ బిక్కులాల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లో కల్లూరు సీహెచ్‌సీ

» ఒకే బెడ్‌పై ముగ్గురు రోగులకు వైద్యం
» సత్వరమే నూతన ఆసుపత్రిని భవనాన్ని ప్రారంభించాలి



సీఎస్‌సీ భవనం

కల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కల్లూరు డివిజన్ కేంద్రంలో గల ప్రాంతీయ వైద్యశాలలో వైద్యుల కొరతతో రోగులకు సక్రమంగా వైద్య సేవలు అందక నానా అవస్థలు పడుతన్నారు. ఆసుపత్రిలో బెడ్ల సౌకర్యం లేక రోగులు తీవ్రమైన ఇబ్బందలు పడుతున్నారు. వైద్యుల సంఖ్య మరీ తక్కువ ఉండడంతో రోగులకు తక్షిణ సేవలు సరిగా అందడం లేదు. అసలే వర్షకాల సీజన్ కావడంతో గత నెల నుంచి ఈ ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య కూడా పెరిగింది. ఇక్కడ పలు రకాల వైద్య సేవలు అందించేందుకు సుమారు 10 మంది వరకు వైద్య నిపుణులు ఉండాల్సి ఉండగా కేవలం ఒక్క వైద్యుడు మాత్రమే ఉన్నారు. వేరే ఆసుపత్రి నుంచి డిప్యూటేషన్‌పై మరో వైద్యుడిని ఇక్కడకు పంపినా వారు నామామాత్రంగా విధులు నిర్వహిస్తున్నారని సమాచారం. ఇక బెడ్ల పరిస్తితి మరీ దారుణంగా మారింది. మొత్తం ఆసుపత్రిలో కేవలం ఐదు పడకలు మాత్రమే ఇక్కడ ఉన్నాయి. ముగ్గురు రోగులు ఒకే బెడ్‌పై వైద్యం పొందాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాత పీహెచ్‌సీ భవనంలోనే సీహెచ్‌సీ వైద్య సేవలు కొనసాగుతున్నాయి. ఈ భవనం కూడా శిథిలావస్థలో ఉంది. ఇక్కడ వైద్యసేవలు కొనసాగాలంటే వైదులకు, సిబ్బందికి, రోగులకు ప్రాణభయంగా ఉంది. కాల క్రమంలో కల్లూరు పట్టణం రెవెన్యూ డివిజన్ కేంద్రంగా విస్తరించడమే కాక మునిసిపాలిటీగా మారింది. జనాభాతో పాటుగా రోగుల రద్ది కూడా పెరిగింది. ఇలా కల్లూరులోని సీహెచ్‌సీలో ప్రభుత్వ వైద్యంపై ఆదరణ పెరగడంతో రోగులు కూడా ఎంతో విశ్వాస్వంతో రాగా, ఇక్కడ సరైన విధంగా వైద్యం అందటం లేదు. ప్రధాన కారణం వైద్యుల నియామకం జరగకపోవడమే. నూతన ఆసుపత్రి భవనం 30 పడకలతో విశాలమైన సౌకరాలతో నిర్మించి ప్రారంభానికి సిద్ధం కాగా ఏ మాత్రం ఫలితం లేదు. ప్రభుత్వ పాలకులు కూడా పట్టించుకోకపోవడంతో ఈ ఆసుపత్రిలో నిరుపేదలు సరైన వైద్యం పొందలేపోతున్నారు. జిల్లా వైద్యాశాఖ అధికారులు కూడా తమకు ఏమాత్రం పట్టనట్లుగా వ్యవహారిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా కల్లూరులో ప్రభుత్వం సుమారు రూ.10 కోట్ల నిధులతో నూతనంగా నిర్మించిన సీహెచ్‌సీ భవనం ప్రారంభానికి నోచుకోక అలంకార ప్రాయంగా మారింది. ఇప్పటికైన కల్లూరు సీహెచ్‌సీక్ష నెలకొన్న సమస్యలను పరిష్కారించేలా ప్రభుత్వ పాలకులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.





వైద్యులు లేక రోగుల అవస్థలు

జీపీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి

వైరా, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికుల జీతాలను వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు గురువారం ఎంపీవో రాజేశ్వరికి ఒక వినతిపత్రం సమర్పించారు. కొన్నినెలల నుంచి వేతనాలు రాక గ్రామపంచాయతీ కార్మికుల కుటుంబాలు గడవడం లేదని, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే వేతనాలు చెల్లించాలని వినతిపత్రంలో కోరారు. నాయకులు ఆళ్ల శ్రీను, తేళ్లూరి రాజేష్, నాగూల్‌మీరా పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో సమస్యలు పరిష్కరించాలి

కల్లూరు, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి) గ్రామంలో ఏర్పడ్డా సమస్యలను పరిష్కరించాలిని అధికారులను కోరుతూ మండలంలోని యర్రబోయనపల్లి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ డివిజన్ కమిటీ నాయకుడు తన్నీరు కృష్ణర్జునరావు మట్లాడుతూ.. స్థానిక ఎన్నకల నిర్వహించకపోవడంతో ప్రజా సమస్యలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని అన్నారు. గ్రామ సమస్యలపై పంచాయితీ కార్యదర్శి సైదులకు వినతిపత్రం అందించారు. దోమతోట్టి వుల్లయ్య, తిగుళ్ల బాబు, వెంకటేశ్వరరావు, శీలం స్వామి, బీరవల్లి బాబు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లను అడ్డుకోవాలి

చింతకాని, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మున్నేటి మధ్యలోని లంక భూముల్లో గేటు ఏర్పాటు చేసి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక ట్రాక్టర్ల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని చింతకాని మండల ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డికు వినతిపత్రం సమర్పించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం రూ.200లకే ఇసుక కూపన్ మంజూరి చేస్తుంటే తన పట్టా భూమిలో నుంచి ఇసుక ట్రాక్టర్లు వెళ్తున్నాయని ఒక్కొ ట్రాక్టరుకు వేయి రూపాయలు వసూలు చేస్తున్నారు. మున్నేరులో అక్రమంగా ఇచ్చిన పట్టా పాస్ పుస్తకాలను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు చిర్రా ఉపేందర్, గుండ్ల రాంబాబు, చాట్ల రాజేష్, అశోక్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

సోషల్‌ఫోరం అధ్యక్షుడిగా కాంతారావు

బోనకల్, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకీపురం ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో సాంఘీక శాస్త్ర టాలెంటు టెస్టు, టీసీ క్లాసుల నిర్వహణకు సంబంధించిన సోషల్ ఫోరం మండల అధ్యక్షుడిగా అరికోట్ల కాంతారావు, ప్రధాన కార్యదర్శిగా నామేపల్లి వీరరాజులను ఎన్నుకున్నారు. సోషల్ ఫోరంను బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు.

17న వారోత్సవ సభను జయప్రదం చేయండి

తల్లాడ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న ఖమ్మంలో జరిగే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ సభను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర నాయకురాలు మాచర్ల భారతి కోరారు. గురువారం స్థానిక దొడ్డా కృష్ణయ్య భవన్‌లో మన్నేపల్లి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. భూమి, భుక్తికోసం, తెలంగాణ విముక్తికోసం, మట్టి మనుషులుజరిపిన చారిత్రక తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది మరణించారని, అట్టి పోరాటాన్ని నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ఆ పోరాటాన్ని మతకోణంలో హిందు, ముస్లిం పోరాటంగా చరిత్రన వక్రీకరించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగే సాయుధ పోరాట వారోత్సవసభకు సీపీఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు మాదినేని రమేష్, డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, నల్లమోతు మోహన్‌రావు, పులి కృష్ణయ్య, కళ్యాణం కృష్ణయ్య, శీలం ఫకీరమ్మ, సత్తెనపల్లి రమేష్, ఆదూరి జీవరత్నం, నన్నేసాహెబ్ పాల్గొన్నారు.

వేల్పులకు పలువురి నివాళి

వైరా, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచాపురం గ్రామంలో కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు వేల్పుల జయరాజు చిత్రపటానికి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం నివాళులర్పించారు. ఉమ్మడి ఖమ్మంజిల్లా పర్యటన సందర్భంగా ప్రీతం గురువారం సాయంత్రం దాచాపురం గ్రామాన్ని సందర్శించారు. జయరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, గరికపాడు సొసైటీ అధ్యక్షుడు అయిలూరి కృష్ణారెడ్డి, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ దర్శీ చెన్నారావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొండయ్య పాల్గొన్నారు.



రైతులను ఆదుకోవాలి

ముదిగొండ, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోయారని అధికారులు తక్షణమే పంట నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మచ్చా వీరయ్య భవనంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శుల సమావేశం సామినేని రామయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్ల యూరియా కొరత ఏర్పడిందన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకురాలు బండి పద్మ, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, నాయకులు టీఎస్.కల్యాణ్, వేల్పుల భద్రయ్య, మంకెన దామోదర్, ఇరుకు నాగేశ్వరరావు, బట్టు రాజు, మందరపు పద్మావతి, కొలేటి అరుణ, ఉపేందర్, పయ్యావుల ప్రభావతి, రాయల శ్రీనివాసరావు, కొండమీది రఘుపతి, పి.రాంబాబు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

వైరా, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): విశ్రాంతి ఉద్యోగుల సంఘం వైరా మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం వైరాలో జరిగిన ఆసంఘం సదస్సులో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా చల్లా కృష్ణారావు, మాచర్ల జయశంకర్, కోశాధికారిగా సామినేని వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా షేక్.వలీజాన్, ఉపాధ్యక్షుడిగా ఎన్.పెంటయ్య, మహిళా ఉపాధ్యక్షురాలిగా కె.సరస్వతీ, కార్యదర్శులుగా జి.సుబ్బయ్య, సీహెచ్‌ఎస్‌వీ.ప్రసాద్, మహిళా కార్యదర్శిగా కొల్లిపర శారదాదేవి, జిల్లా కౌన్సిలర్లుగా నూతకాని ప్రసాద్, జీవీ.కృష్ణారావు, పొన్నం నర్సింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.